

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | గురువారం | 21.05.2026 | సంపుటి: 3 | సంచిక: 109 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | THURSDAY | 21.05.2026 | VOLUME : 3 | ISSUE : 109 | PAGES: 8 | COST: 2/- |

# జనగణనలో కుల గణనకు సుప్రీం ఓకే

- వ్యతిరేకిస్తూ వచ్చిన పిటిషన్లు తిరస్కరణ



**న్యూఢిల్లీ, మే 20(రాజముద్ర న్యూస్) :**

కులగణనపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. జనగణనలో కులాల లెక్కింపునకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం అనుమతి ఇచ్చింది. కులగణనను వ్యతిరేకిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని చీఫ్ జస్టిస్ (సీజేఐ) సూర్యకాంత్, జస్టిస్ జయ మల్యా బాగ్చీ, విపుల్ పంచోలీలతో కూడిన ధర్మాసనం బుధవారం కొట్టివేసింది. సంక్షేమ పథకాల అమలుకు కులగణన తప్పనిసరి అని స్పష్టం చేసింది. కుల గణన ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, ఈ అంశంలో కోర్టుల జోక్యం ఉండదని స్పష్టం చేసింది. వెనుకబడిన తరగతికి చెందిన వారు ఎంతమంది ఉన్నారో ప్రభుత్వం తెలుసుకోవాల్సి ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది.




## మూడో డిస్కమ్
# ముళ్ల కిరీటం!

- అనుమతి ఇవ్వాలా వద్దా? ఈఆర్సీ మల్లగుల్లాలు
- ప్రారంభించాలన్న మొండిపట్టుతో ప్రభుత్వం..
- అక్కరలేని డిస్కామ్ ఎందుకని ఉద్యోగులు, మేధావుల ఆక్షేపణ
- పండగ ఆఫర్లలా 'ప్రమోషన్ల' ఎర.. కొత్త వ్యవస్థపై సర్వత్రా వెల్లువెత్తుతున్న నిరసనలు
- ముందే కోర్టులో కేవియెట్ దాఖలు చేసిన ప్రభుత్వం
- డిస్కామ్‌లను ప్రైవేట్ పరం చేసేందుకేనా నయా స్కెచ్

3

## బండి సంజయ్‌కు బీజేపీ
# హైకమాండ్ అండ?



- భగీరథ్ వ్యవహారంపై బీఆర్ఎస్ దూకుడు
- రెండు రోజుల మౌనం తర్వాత బీజేపీ కౌంటర్ ఎటాక్
- సంజయ్‌ను టార్గెట్ చేస్తే ఊరుకోమన్న రామచంద్రరావు

3



## నా భౌతిక దేహంపై బీజేపీ జెండానే కప్పాలి!

- అదే నా చివరికి కోరిక
- కొత్త పార్టీ ప్రచారంపై భావోద్వేగానికి గురైన బండి
- కొడుకును స్వయంగా అప్పజెప్పిన తండ్రిని నేనని వివరణ
- బండి భగీరథ్ విషయంపై ధర్మాన్ని పాటిస్తా

3



బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై
## సింగరేణి ఆసక్తి

- కేంద్ర సహకారం అవరం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరిన డిప్యూటీ సీఎం భట్టి
- కొయ్యగూడెం బ్లాక్-III కేటాయింపు, తాడిచెర్ల బ్లాక్-II లీజ్‌పై చర్చ

2

# నెట్ జీరో సిటీ తరహా
# డిజైన్స్ ఉండాలి

- అంతర్జాతీయ సంస్థలను ఫ్యూచర్ సిటీకి రప్పించాలి
- ప్రజాప్రతినిధులు, బ్యురోక్రాట్లు, జర్నలిస్టులకు 500 ఎకరాలు
- హెల్త్ క్లస్టర్ వచ్చేలా చర్యలు తీసుకోవాలి
- పరిశ్రమల ఏర్పాటుపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష



**హైదరాబాద్, మే 20(రాజముద్ర న్యూస్) :**

భారత్ ఫ్యూచర్ సిటీలో నెట్ జీరో సిటీ తరహాలోనే డిజైన్స్ ఉండాలని, మౌలిక వసతుల కల్పన అంతర్జాతీయ స్థాయిలో ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందులో రాజీ పడొద్దని అన్నారు. ఇక్కడ భూమి కేటాయింపు, పరిశ్రమల ఏర్పాటుపై ఎంసీఆర్ హెచ్ ఆర్ డీ బోధి పెవిలియన్ లో ముఖ్యమంత్రి బుధవారం సమీక్ష నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసిన తర్వాతే భూ కేటాయింపులు చేయాలని, అంతర్జాతీయస్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలి

మిగతా 2వ పేజీలో..

## తెలంగాణలో దారెత్తిస్తున్న ఎండలు

2





మిగతా 2 లో

## యువ ఐఏఎస్ అధికారులతో సీఎం రేవంత్ భేటీ

**హైదరాబాద్, మే20 (రాజముద్ర న్యూస్):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని 2025 బ్యాచ్‌కు చెందిన శిక్షణలో ఉన్న ఐఏఎస్ అధికారులు

మిగతా 2వ పేజీలో..




## గ్లోబల్ టెక్ ట్రావెల్ క్లస్టర్‌గా హైదరాబాద్

సౌత్ వెస్ట్ ఎయిర్‌లైన్స్ ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభోత్సవంలో శ్రీధర్‌బాబు

3



## నేడే సరస్వతీ అంత్య
# పుష్కరాలు ప్రారంభం

- జూన్ 1వ తేదీ వరకు పుష్కరాలు
- 40 లక్షల భక్తుల హాజరయ్యే అవకాశం
- పుష్కరాలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి
- రూ.1.20 కోట్లతో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు
- విజయవంతం చేయాలి : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి

**భూపాలపల్లి, మే 20 (రాజముద్ర న్యూస్):**

మండువేసవిలో చల్లని తల్లి సరస్వతి దేవి అంత్య పుష్కరాలు గురువారం నాడు అంగరంగ వైభవంగా ప్రారంభించడానికి ప్రభుత్వం సకల సౌకర్యాలు ఏర్పాట్లు పూర్తి చేసింది. ముందస్తుగా కంచి పీఠాధిపతి స్వామీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ తొలి పుష్కర స్నానం ఆచరించనున్నారు. మే 21 నుండి జూన్ 1వ తేదీ వరకు కాళేశ్వరంలో జరిగే సరస్వతీ అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. పుష్కర

మిగతా 2వ పేజీలో..

## హైదరాబాద్ మెట్రో రెండో దశకు
# కేంద్రం గ్రీన్ సిగ్నల్

- 50:50 వ్యయంతో ముందుకెళ్లేందుకు సిద్ధమన్న కేంద్రం
- 162 కిలోమీటర్ల విస్తరణ ప్రతిపాదనలపై సానుకూల సంకేతాలు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో సమావేశంలో స్పష్టత

2





## ఫేస్ట్ సిమ్‌లపై దేశ వ్యాప్తంగా పోలీసుల ఉక్కుపాదం

- "ఆపరేషన్ ఆక్టోపస్-3"లో 66 మంది అరెస్ట్
- 544 సిమ్ కార్డుల స్వాధీనం.. రూ.101 కోట్ల సైబర్ మోసాల గుర్తింపు

2

## ఆసిఫాబాద్ గడ్డపై
# 'ఇందిరమ్మ' పండుగ

- 2న రెండో విడత ఇందిరమ్మ ఇండ్లకు సీఎం రేవంత్ శ్రీకారం
- అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొంగులేటి

2





## కులగణనను స్వాగతిస్తున్నాం

- సుప్రీంకోర్టు తీర్పుపై మంత్రి పొన్నం హర్షం
- సామాజిక న్యాయానికి బలం చేకూరిందన్న మంత్రి

3

# బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై సింగరేణి ఆసక్తి

**న్యూఢిల్లీ, మే 20, :**

బొగ్గును కేవలం సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తికే పరిమితం చేయకుండా భవిష్యత్ పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విలువ ఆధారితంగా వినియోగించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డితో న్యూఢిల్లీలో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సింగరేణి కంపెనీ భవిష్యత్ ప్రణాళికలు, బొగ్గు గ్యాసిఫికేషన్ అవకాశాలు, కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్ II మైనింగ్ లీజ్ అంశాలపై చర్చించారు. దేశవ్యాప్తంగా బొగ్గు గ్యాసిఫికేషన్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో సింగరేణి కూడా ఆ దిశగా ముందడుగు వేయడానికి సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రికి భట్టి వివరించారు. కోల్ ఇండియా చేపడుతున్న గ్యాసిఫికేషన్ కార్యక్రమాల తరహాలోనే సింగరేణి కూడా తన బొగ్గు వనరులను ఆధునిక సాంకేతికతతో మరింత సమర్థవంతంగా వినియోగించే అవకాశాలను పరిశీలిస్తోందన్నారు. బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా బొగ్గు వనరులకు అదనపు విలువ కల్పించడంతోపాటు, ఇంధన భద్రత, పారిశ్రామిక వినియోగాలు, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని అన్నారు. ఇందుకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం, విధానపరమైన సహకారం, కేంద్ర పథకాల అనుసంధానంలో బొగ్గు మంత్రిత్వ శాఖ సహకారం అందించాలని కోరారు. సింగరేణి దక్షిణ భారత దేశ బొగ్గు సరఫరా, విద్యుత్ రంగ అవసరాల తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న సంస్థ అని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సింగరేణికి కొత్త బొగ్గు వనరుల సమీకరణ అత్యవసరమని తెలిపారు. గోదావరి వ్యాలీ కోల్ ఫీల్డ్స్ పరిధిలోని కొయ్యగూడెం బ్లాక్III తెలంగాణ విద్యుత్ అవసరాలకు కీలకమని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఈ బ్లాక్‌ను వేలంలో కేటాయించిప్పటికీ నాలుగేళ్లు గడిచినా కార్యకలాపాలు ప్రారంభం కాలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో కొయ్యగూడెం బ్లాక్IIIను సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తాడిచెర్ల కోల్ బ్లాక్II అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. ఈ బ్లాక్‌కు సంబంధించి సింగరేణి ఇప్పటికే ప్రీమైనింగ్ కార్యకలాపాలు, అన్వేషణ పనులు చేపట్టిందని, మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. తాడిచెర్ల బ్లాక్II అభివృద్ధి సింగరేణి భవిష్యత్ అవసరాలకు, తెలంగాణ విద్యుత్ భద్రతకు కీలకమని చెప్పారు. తాడిచెర్ల కోల్ బ్లాక్‌కు ఎంఎండీఆర్ చట్టం,1957లోని సెక్షన్5 కింద ముందస్తు అనుమతి మంజూరు చేసి మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరారు. ఈ అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. సింగరేణి బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రణాళికలు, కొయ్యగూడెం బ్లాక్III కేటాయింపు, తాడిచెర్ల బ్లాక్II మైనింగ్ లీజ్ అంశాలపై కేంద్ర, రాష్ట్ర అధికారులు, సింగరేణి ప్రతినిధులతో త్వరలో సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్, సింగరేణి సీఎండీ డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్, డైరెక్టర్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ గౌతమ్ పొట్రు, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ మెట్రో రెండో దశకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

**న్యూఢిల్లీ, మే 20,**

హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయ అంగీకారం తెలిపింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో జరిగిన సమావేశంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్లాల్ కట్టర్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన డీపీఆర్‌ను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టుపై కేంద్రానికి ఎటువంటి అభ్యంతరం లేదని మనోహర్లాల్ కట్టర్ స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఎల్ అండ్ టీ సంస్థ నుంచి ప్రాజెక్టును టేకోవర్ చేసుకుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన భాగస్వామ్యంతో 50:50 వ్యయ విధానంలో ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 162 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరణ ప్రణాళికపై కేంద్రం సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. ప్రతిపాదనలపై సమగ్ర పరిశీలన అనంతరం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

హైదరాబాద్ నగర అభివృద్ధి, పెరుగుతున్న రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెట్రో విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కేంద్రం తెలిపింది. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని మనోహర్లాల్ కట్టర్ స్పష్టం చేశారు.

మెట్రో రెండో దశకు కేంద్రం సానుకూల సంకేతాలు ఇవ్వడంతో ప్రాజెక్టు వేగవంతం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. నగర పరిసర ప్రాంతాలకు మెట్రో సేవలు విస్తరించే అవకాశం ఉండటంతో ప్రయాణికుల్లో ఆశలు పెరిగాయి.

# తెలంగాణలో దారెత్తిస్తున్న ఎండలు

**హైదరాబాద్, మే 20,**

తెలంగాణలో పెరుగుతున్న ఎండల తీవ్రత, వడగాలుల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సూచించారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉండటంతో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

జిల్లా కలెక్టర్లు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సీఎం సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు తగిన స్థాయిలో అందుబాటులో ఉంచాలని, తాగునీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎం పేర్కొన్నారు. వడదెబ్బతో బాధపడుతూ ఆసుపత్రులకు వచ్చే వారికి తక్షణ వైద్య సేవలు అందించాలని సూచించారు.

పట్టణ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. సాధ్యమైనంత వరకు ప్రజలు మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.

రాష్ట్రంలోని పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ జిల్లా కలెక్టర్లకు అవసరమైన సూచనలు ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.



# నెట్ జీరో సిటీ తరహా డిజైన్స్ ఉండాలి

**మొదటిపేజీ తరువాయి**

కోరారు. ఫ్యూచర్ సిటీలో ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టులకు 500 ఎకరాలు కేటాయించాలన్నారు. కేంద్రం ప్రకటించిన హెల్త్ క్లస్టర్ ఫ్యూచర్ సిటీకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరం అయితే ప్రధాని మోదీని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దామన్నారు. జూన్‌లో ఫ్యూచర్ సిటీ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగేలా చూడాలన్నారు. భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమలు నిర్మాణం మొదలు పెట్టేలా నిబంధన విధించాలని సూచించారు. ఇన్వెస్ట్ తెలంగాణ పేరులో పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని, ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ఆకర్షణీయమైన లోగో, వెబ్‌సైట్ రూపొందించాలని, ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారి కోసం ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థని రూపొందించాలని, గ్రూప్1 స్థాయి అధికారిని ఎస్కార్ట్ ఆఫీసర్‌గా నియమించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. తమిళనాడు, గుజరాత్ పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేయాలన్నారు. బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ ప్రారంభించాలని, 1500 ఎకరాల్లో



డేటా సిటీ ఏర్పాటు చేయాలని, .డేటా సిటీ నీటి అవసరాల కోసం ఎస్‌టీపీలను వినియోగించాలని, జీసీసీలు, డేటా సెంటర్ల కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రోడ్ల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములు గుర్తించాలని, ద్వితీయ శ్రేణి నగరాల్లో జీసీసీల ఏర్పాటుపై దృష్టి పెట్టేలా పాలసీ రూపకల్పన చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మూడు నెలల్లో ప్రభుత్వ కార్యాలయాలు టీ ఫైబర్‌కు కనెక్ట్ కావాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశానికి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) వైస్ చైర్మన్ శశాంక, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**సీఎంతో ఎఫ్‌టీసీసీఐ బృందం భేటీ**

ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) అధ్యక్షుడు ఆర్.రవికుమార్ బుధవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో కలిశారు. ఈయనతోపాటు జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎఫ్‌టీసీసీఐ డైరెక్టర్ సంగీత, ఎఫ్‌టీసీసీఐ ఎక్సలెన్స్ అవార్డ్స్ చైర్మన్ భాస్కర్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌టీసీసీఐ ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమానికి ఎఫ్టీసీసీఐ బృందం ముఖ్యమంత్రిని ఆహ్వానించింది.

# పట్టపగలు మహిళపై వేధింపులు

- **నార్సింగి ఇన్‌స్పెక్టర్ జి హరికృష్ణ రెడ్డి**

**హైదరాబాద్, మే20:**

హైదరాబాద్ నగరంలో పట్టపగలు బిడ్డతో వెళ్తున్న మహిళపై యువకుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటన కలకలం రేపింది. అల్కాపూర్ టౌన్‌షిప్‌లో జరిగిన ఈ ఘటన సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ కావడంతో వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీంతో నగరవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళల భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 14న మధ్యాహ్నం 1:44 గంటల సమయంలో మణికొండనెక్నాంపూర్ పరిధిలోని అల్కాపూర్ టౌన్‌షిప్‌లో ఘటన జరిగింది. ప్రాణతి ఈషా అపార్ట్‌మెంట్ సమీపంలో ఓ మహిళ తన చిన్నారిని ఎత్తుకుని ఇంటికి నడుచుకుంటూ వెళ్తోంది. ఎండ తీవ్రంగా ఉండటంతో గొడుగు పట్టుకుని వెళ్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన ఓ టీనేజ్ యువకుడు ఆమె దుస్తులను పైకి లాగి అసభ్యంగా ప్రవర్తించాడు.ఆకస్మిక ఘటనతో మహిళ ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురైంది. వెంటనే వెనక్కి తిరిగి చూసేలోపే నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో స్పష్టంగా రికార్డ్ అయ్యాయి. వీడియో వైరల్ కావడంతో నార్సింగి పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు.

# ఆసిఫాబాద్ గడ్డపై 'ఇందిరమ్మ' పండుగ

**హైదరాబాద్/కొమరం భీమ్ ఆసిఫాబాద్, మే 20:**

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న పేదల సొంతింటి కలలను నిజం చేసే ప్రతిష్టాత్మక ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత కార్యక్రమానికి కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వేదిక కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బుధవారం జిల్లాలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, శాసనమండలి సభ్యుడు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె.హరిత, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తదితరులతో కలిసి మంత్రి సభాస్థలి, రెబ్బెన మండలం కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్, కాగజ్‌నగర్ మండలం దాదానగర్, సిర్పూర్ పేపర్ మిల్ క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి సందర్శించనున్న ప్రాంతాలతోపాటు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను కూడా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ నాటికి రాష్ట్రవ్యాప్తంగా లక్షా 20 వేల ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, జూన్ నాటికి 2.35 లక్షల ఇండ్లు పూర్తవుతాయని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణం ఆర్భాటాలకు మాత్రమే పరిమితమైందని, కానీ ప్రజా ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోపే నాగులు లక్షల ఇండ్ల నిర్మాణానికి రూ.22,700 కోట్లతో శ్రీకారం చుట్టిందని చెప్పారు. మొదటి, రెండో విడతలకే పరిమితం కాకుండా అర్హత గల ప్రతీ నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే వరకు ప్రభుత్వం కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆదివాసీ జిల్లా కొమరం భీమ్ ఆసిఫాబాద్‌లోని కొఠారి గ్రామంలో గిరిజన కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడం ద్వారా ఆదివాసీల సొంతింటి కష్టాలను తొలగిస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ, మహిళను కుటుంబానికి ఆధారస్తంభంగా గుర్తిస్తూ మహాలక్ష్మి, గృహజ్యోతి, రేషన్ కార్డులు, ఇందిరా మహిళా శక్తి, రాజీవ్ ఆరోగ్య శ్రీ వంటి పథకాల ద్వారా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అర్హులైన పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘోస్ట్ సిమ్‌లపై దేశవ్యాప్తంగా పోలీసుల ఉక్కుపాదం

**హైదరాబాద్, మే 20,**

సైబర్ నేరాలకు ప్రధాన కేంద్రంగా మారుతున్న ఘోస్ట్ సిమ్ వ్యవస్థపై హైదరాబాద్ నగర పోలీసులు భారీ స్థాయిలో చర్యలు చేపట్టారు. "ఆపరేషన్ ఆక్టోపస్3" పేరుతో దేశవ్యాప్తంగా విస్తృత దాడులు నిర్వహించి కీలక ముఠాలను అదుపులోకి తీసుకున్నారు. సైబర్ నేరాల మూలాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే మ్యూల్ ఖాతాదారులు, అక్రమాలకు సహకరించిన బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకున్న పోలీసులు ఇప్పుడు ఘోస్ట్ సిమ్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా 18 ప్రత్యేక బృందాలు దేశంలోని 13 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించాయి.

ఈ దాడుల్లో మొత్తం 66 మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. వారి వద్ద నుంచి 544 సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో భాగంగా ఈ సిమ్‌ల ద్వారా దేశవ్యాప్తంగా రూ.101.87 కోట్ల విలువైన 76 సైబర్ నేరాలు జరిగినట్లు గుర్తించారు. అరెస్టైన వారిలో ప్రముఖ టెలికాం సంస్థలకు చెందిన 20 మంది విక్రయ కేంద్ర ప్రతినిధులు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. వినియోగదారుల బయోమెట్రిక్ వివరాలను అక్రమంగా సేకరించి నిబంధనలకు విరుద్ధంగా సిమ్‌లు జారీ చేసినట్లు తేలిందని పేర్కొన్నారు. "సర్వర్ పనిచేయడం లేదు" అంటూ అదనపు బయోమెట్రిక్ వివరాలు తీసుకోవడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత అంతర్జాలం పేరుతో నిరక్షరాస్యుల ఆధార్ వివరాలు సేకరించడం వంటి మోసపూరిత పద్ధతులను ముఠాలు అనుసరిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఇలా సేకరించిన సిమ్‌లను వెంటనే ఈసిమ్‌లుగా మార్చి విదేశాల్లో ఉన్న సైబర్ ముఠాలకు చేరవేస్తున్నట్లు విచారణలో బయటపడింది. ఆ సిమ్‌లతో సామాజిక మాధ్యమ ఖాతాలు తెరిచి డిజిటల్ అరెస్ట్, బ్లాక్‌మెయిల్, ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ప్రజలు తమ ఆధార్, బయోమెట్రిక్ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని పోలీసులు హెచ్చరించారు. తమ పేరుపై ఎన్ని సిమ్‌లు ఉన్నాయో అధికారిక సంచార్ సాథి పోర్టల్‌లో పరిశీలించాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే జాతీయ సైబర్ ఫిర్యాదు పోర్టల్ లేదా 1930 సహాయ సంఖ్యను సంప్రదించాలని తెలిపారు.

# నేడే సరస్వతీ అంత్య పుష్కరాలు ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి**

స్నానాలు మే 21 వ తేదీ నుండి 12 రోజుల పాటు జూన్ 1 వరకు 12 రోజులు జరగనున్నాయి. ఈ పుష్కరాలకు 30 నుండి 40 లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నదని ప్రభుత్వం భావిస్తోంది.ఈ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. గత సంవత్సరం జరిగిన సరస్వతీ ఆది పుష్కరాల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ అంత్య పుష్కరాలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలను చేపట్టింది. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పుష్కర ఘాట్ వద్ద క్వయర్ మ్యాట్లు, చలువ పందిళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున పుష్కర ఘాట్ పరిసరాల్లోని 23 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్, బీ.టి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం 30.63 కోట్ల నిధులను కేటాయించింది. పుష్కరాల తొలిరోజైన 21 వ తేదీ తెల్లవారు జామున 5.43 గంటలకు కంచి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి వారు పుష్కర స్నానం చేసి అంత్య పుష్కరాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. ప్రారంభం నుండి జూన్ 1వ తేదీ వరకు ప్రతీ రోజూ ఒక ప్రముఖ పీఠం స్వామిజీ ఈ పుష్కరాల్లో పాల్గొని పుణ్య స్నానం చేస్తారు. ప్రతీరోజూ ఉదయం హోమాలు నిర్వహణ, సాయంత్రం పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పుష్కర స్నానాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం 90 షటిల్ బస్సులను ఏర్పాటు చేశారు. రెస్క్యూ బృందాలతోపాటు ప్రత్యేక శిక్షణ పొందిన 100 మంది గజ ఈతగాళ్లను సరస్వతీ ఘాట్, నదీ ప్రాంతంలో నియమించారు.



దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.1.20 కోట్లలతో ప్రత్యేకంగా మ్యూజియాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడి నాగేంద్ర స్వామి ఆలయాన్ని 30 లక్షలతో పునర్నిర్మాణం చేశారు. పుష్కరాల సందర్భంగా ప్రతిరోజూ నిర్వహించే హారతి, హోమాలు, తెప్పోత్సవం లకు పెద్ద ఎత్తున ఏర్పాట్లను చేపట్టారు. పుష్కరాలకు హాజరయ్యే వారి సౌకర్యార్థం పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పించారు. దాదాపు 500 మరుగుదొడ్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి కోసం రెండు ఓ.హెచ్.ఆర్.సి లను నిర్మించారు. వాహనాల కోసం ఏర్పాటు చేసిన 23 పార్కింగ్ కేంద్రాలలోనూ తాగునీటి సౌకర్యంతో పాటు మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు.

**మెడికల్ క్యాంపులు ఏర్పాటు..**

కాళేశ్వరం పుష్కర ఘాట్ లోని 23 జోన్లలో ప్రత్యేక మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ఇందుకుగాను వైద్యులు, వైద్యాధికారులు, పారా మెడికల సిబ్బందిని 300 మందిని ప్రత్యేకంగా నియమించారు. అన్ని ప్రధాన ప్రాంతాల్లో అంబులెన్సులు అందుబాటులో ఉంచనున్నారు. మహాదేవ పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రెఫరల్ ఆసుపత్రిగా ఏర్పాటు చేశారు.

**వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు...**

సరస్వతీ అంత్య పుష్కారాలకు లక్షా 70 వేల వాహనాలు వస్తాయని అధికారులు అంచనా వేసారు. వీటికి గాను 245 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. పార్కింగ్ ఏరియాలతో పాటు ఘాట్స్, దేవాలయం తదితర ప్రాంతాలలో 200 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పుష్కర స్నానాలకు వెళ్లే మార్గంలో ప్రత్యేకంగా ఎల్.ఈ.డీ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ 12 రోజులపాటు పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణకుగాను 300 మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించారు. పుష్కర ఘాట్లలో నిరంతరం విద్యుత్ సరఫరా జరిగే విధంగా చర్యలు చేపట్టారు.

**100 మంది గజ ఈతగాళ్ల నియామకం..**

పుష్కర స్నానాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా 100 మంది గజ ఈతగాళ్లను నియమించారు. వీటితోపాటు సేఫ్టీ బోట్స్, లైఫ్ రింగ్స్, ఎస్.డి.ఆర్.ఎఫ్ టీంలను నియమించారు. పుష్కర కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందించేందుకు ఈఓ కార్యాలయంలో మీడియా సెంటర్ చేశారు.

**పుష్కరాలను విజయవంతం చేయండి...**

**– రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు**

సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహిస్తున్న సరస్వతి దేవి అంత్యపుష్కరాలలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర ఐటి,పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రజలకు, భక్తులకు విజ్ఞప్తి చేశారు. స్వల్ప కాలవ్యవధిలోనే ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు భక్తులకు కావలసిన అన్ని రకాల సౌకర్యాలను పెద్ద ఎత్తున చేపట్టారని పేర్కొన్నారు. భక్తులు పూర్తి సౌకర్యవంతంగా పుణ్య స్నానాలు ఆచరించి ఓపికగా దైవ దర్శనం చేసుకొని పునీతులు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నా భౌతిక దేహంపై బీజేపీ జెండానే కప్పాలి!

**తెలంగాణ బ్యూరో, మే20:**

బీజేపీ పై ప్రేమ ఉన్న వ్యక్తిని.. చివరి శ్వాస విడిచాక భౌతిక దేహంపై బీజేపీ జెండా కప్పాలనే చివరి కోరిక ఉన్న ఎంతో మంది అభిమానుల్లో నేను ఒకడిని. అంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ భావోద్వేగంతో తెలిపారు.బండి భగీరథ్ పై ఆరోపణలు వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చిన సందర్భంగా అయన మాట్లాడుతూ తనపై రకరకాల ఊహాగానాలు రావడం పై అయన అభ్యంతరం వ్యక్తం చేసారు. నేను కొత్త పార్టీ పెడుతున్నా అని ఒకరు రాస్తారు. నేను బీజేపీ లోనుండి బీజేపీ ద్వారానే ఈ స్థాయికి వచ్చా అలాంటపుడు నాపై ఇలా ఆరోపణలు చేయడం తగదన్నారు. కొత్త పార్టీ అనే చిల్లర మల్లర రాజకీయాలు చేసే ఆలోచనలు ఉండవు.. నేను ఎప్పటికి బీజేపీ కార్యకర్తనే అని అయన వివరణ ఇచ్చారు. కొడుకును స్వయంగా పోలీసుల కు అప్పగించిన ఏకైక నాయకుడిని నేను. కేసీఆర్ కొడుకులా ఫేక్ మీడియాలు నడిపి దుష్ప్రచారం చేసేవాళ్ళం కాదు...వాళ్ళ గడి గోడలు బద్దలు కొట్టాం.. ఫ్రస్టేషన్ తో ఏదో ఏదో చేస్తుంటారు.. అవన్నీ పట్టించుకోం.. నన్ను అరెస్ట్ చేస్తారనే విషయంపై మాట్లాడను.. కోర్టు లో అన్ని తేలుతాయి.. కాగా, సంజయ్ కు సంఘీభావంగా భారీ సంఖ్యలో బీజేపీ శ్రేణులు కార్యాలయానికి చేరుకుని.. న్యాయం గెలుస్తుంది.. సంజయ్ మా నాయకుడు అంటూ పెద్ద పెట్టిన నినాదాలతో హోరెత్తించారు.

## కులగణనను స్వాగతిస్తున్నాం

**హైదరాబాద్, మే 20**

కులగణనపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. జనగణనలో కులాల లెక్కింపునకు అనుమతి ఇవ్వడం సామాజిక న్యాయం దిశగా కీలక అడుగని పేర్కొన్నారు. కులగణనను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడం హర్షణీయమన్నారు.

తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కులగణన చేపట్టి సామాజిక న్యాయం అమలులో ముందంజలో ఉందని మంత్రి తెలిపారు. బలహీన వర్గాలకు సరైన ప్రాధాన్యం, అవకాశాలు కల్పించాలంటే ఖచ్చితమైన గణాంకాలు అవసరమని అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా కూడా తెలంగాణ తరహాలో కులగణన నిర్వహించాలని మంత్రి డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ కూడా గతంలో ఇదే అంశాన్ని దేశవ్యాప్తంగా ప్రస్తావించారని గుర్తు చేశారు.

కులగణన ద్వారా వెనుకబడిన వర్గాల అసలు పరిస్థితులు వెలుగులోకి వస్తాయని, అప్పుడు మాత్రమే సముచిత రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు సమర్థంగా అమలు చేయగలమని పేర్కొన్నారు.

వెనుకబడిన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని, ప్రస్తుతం అది రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఆమోద ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి డిమాండ్ చేశారు.

## సస్పెండ్ అయినా తగ్గని లగ్జరీ..

- **సబ్ రిజిస్ట్రార్ ఇంట్లో తనిఖీల్లో బయటపడ్డ కోట్లు..!**
- **హన్మకొండలో ఏసీబీ సర్ప్రైజ్ దాడులు**
- **ఇళ్లు, ప్లాట్లు, నగదుతో భారీ ఆస్తుల గుర్తింపు**
- **ఇంట్లో లగ్జరీ కారు, బంగారం, వెండి స్వాధీనం**
- **రూ.30 కోట్ల అక్రమాస్తులపై కేసు నమోదు**

**హన్మకొండ, మే,20:**

: అక్రమార్జనతో కోట్లు కూడబెట్టిన మరో ప్రభుత్వ అధికారి అవినీతి నిరోధక శాఖ (ACB) వలలో చిక్కారు. హన్మకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్II గా పనిచేస్తూ, ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న దేవులూరి ఆనంద్ ఇళ్లపై ఏసీబీ అధికారులు బుధవారం సర్ప్రైజ్ చెక్స్ నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే పక్కా సమాచారంతో ఆనంద్ నివాసంతో పాటు ఆయన బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఈ దాడుల్లో సదరు అధికారికి ఏకంగా రూ. 30 కోట్ల రూపాయల విలువైన ఆస్తులు ఉన్నట్లు అధికారులు గుర్తించడం సంచలనంగా మారింది.



ఈ ఏసీబీ సోదాల్లో భారీగా స్థిరాస్తులు, నగదు, బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. డాక్యుమెంట్ల ప్రకారం సుమారు రూ. 71,56,708 విలువైన రెండు లగ్జరీ నివాస గృహాలు, అలాగే రూ. 28,37,000 విలువైన ఆరు ఓపెన్ ప్లాట్లకు సంబంధించిన పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అయితే వీటి ప్రస్తుత ఓపెన్ మార్కెట్ విలువ అధికారిక ప్రభుత్వ అంచనాల కంటే చాలా రెట్లు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏసీబీ పేర్కొంది. స్థిరాస్తులతో పాటు ఇళ్లలో దాచిన రూ. 24,50,450 లిక్విడ్ క్యాష్, రూ. 7,05,367 బ్యాంక్ బ్యాలెన్స్, అలాగే రూ. 6,07,700 విలువైన హోమ్ అప్లయన్సెస్ (గృహోపకరణాలు) కనుగొన్నారు. వీటితో పాటు రూ. 13,25,000 విలువ చేసే ఒక లగ్జరీ కారు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇక అన్నింటికంటే ముఖ్యంగా సదరు సస్పెండెడ్ అధికారి ఇంట్లో ఏకంగా 819.5 గ్రాముల బంగారం, 2264.5 గ్రాముల వెండి వస్తువులు లభించాయి. వీటి మొత్తం విలువ సుమారు రూ. 43,16,930 గా అధికారులు లెక్కగట్టారు. ప్రస్తుతం ఈ అక్రమాస్తుల వ్యవహారంపై ఏసీబీ కేసు నమోదు చేసి, దర్యాప్తును మరింత వేగవంతం చేసింది.

## నేను ఎలాంటి వాడినో కార్యకర్తలకు తెలుసు

- **కొడుకును స్వయంగా పోలీసులకు అప్పగించానన్న బండి సంజయ్**
- **కేసీఆర్ కుటుంబ పాలనను అంతం చేసింది బీజేపీయేనని వ్యాఖ్య**

**హైదరాబాద్, మే 20**

పోక్సో కేసులో తన కుమారుడిని స్వయంగా పోలీసులకు అప్పగించానని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ తెలిపారు. విచారణకు పూర్తిస్థాయిలో సహకరించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తాను ఎలాంటి వాడినో బీజేపీ కార్యకర్తలకు బాగా తెలుసని అన్నారు.

హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన బండి సంజయ్..కన్నకొడుకును స్వయంగా పోలీసులకు అప్పగించిన సందర్భం మరెక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. చట్టంపై విశ్వాసంతోనే విచారణకు సహకరిస్తున్నామని పేర్కొన్నారు.బీజేపీ కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేసే వారని, పార్టీ కోసం అంకితభావంతో పని చేస్తారని అన్నారు. ఒక బీజేపీ కార్యకర్తను చివరి కోరిక ఏమిటని అడిగితే చనిపోయిన తర్వాత పార్టీ జెండా కప్పాలని కోరుకుంటాడని వ్యాఖ్యానించారు తనను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఇతర పార్టీల నాయకులు చేస్తున్న డిమాండ్లపై కూడా బండి సంజయ్ స్పందించారు. కేసీఆర్ పార్టీకి ప్రస్తుతం లోక్‌సభలో ఒక్క ఎంపీ కూడా లేరని విమర్శించారు. ఫామ్ హౌస్‌లో కూర్చుని తమపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ అవినీతి సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో పెకలించింది బీజేపీయేనని బండి సంజయ్ పేర్కొన్నారు. కుటుంబ పాలనకు ముగింపు పలికినందుకే తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు.

# మూడో డిస్కమ్ ముళ్లకిరీటం!

**తెలంగాణ బ్యూరో, మే20:**

తెలంగాణ విద్యుత్ శాఖలో ప్రతిపాదిత మూడవ డిస్కామ్ (రైతు డిస్కామ్) ఏర్పాటు వ్యవహారం ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. ఎన్నో అభ్యంతరాలు, నిరసనల మధ్య పురుడు పోసుకోబోతున్న ఈ కొత్త డిస్కామ్‌కు అనుమతి ఇవ్వాలా వద్దా అనే విషయమై తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి తీవ్ర మల్లగుల్లాలు పడుతోంది. ఇప్పటికే ఉన్న రెండు డిస్కామ్‌ల నుంచే ఆస్తులను, అప్పులను, ఉద్యోగులను పంచి.. కేవలం ఉచిత పథకాల నిర్వహణ కోసమే ఈ సరికొత్త 'రైతు డిస్కామ్'ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం మొండిపట్టుతో ముందుకు సాగుతోంది. అయితే, ఈ నిర్ణయం ఉన్న వ్యవస్థను బాగుచేయకపోగా, మరింత నష్టాల ఊబిలోకి నెట్టేసే ప్రమాదం ఉందంటూ విద్యుత్ రంగానికి చెందిన ఉద్యోగ, సామాజిక, మేధావి వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అసలు ఈ కొత్త డిస్కామ్ వల్ల ఒనగూరే ప్రయోజనం ఏంటో, దీని వెనుక ఉన్న హేతుబద్ధత ఏంటో తెలియకుండానే కేవలం పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి, పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం తొందరపడుతుండటం ఇప్పుడు ఎన్నో సందేహాలకు తావిస్తోంది.

**పండగ ఆఫర్లలా ప్రమోషన్ల ఎర..**

సాధారణంగా పండగ సీజన్లలో వ్యాపార సంస్థలు 'ఒకటి కొంటే ఒకటి ఉచితం' అంటూ కస్టమర్లను ఆకర్షించడానికి బంపర్ ఆఫర్లు ప్రకటిస్తుంటాయి. కానీ, ఆశ్చర్యకరంగా ఇక్కడ తెలంగాణ విద్యుత్ శాఖలో కొత్తగా ఏర్పాటు చేయనున్న రైతు డిస్కామ్‌లో చేరితే 'ప్రమోషన్ ఆఫర్' ఇస్తామంటూ ప్రభుత్వం కొత్త ఎర వేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. కొత్త డిస్కామ్ ఏర్పాటు ప్రకటన వెలువడిన మొదట్లో ఉద్యోగుల్లో భవిష్య నిధి, పెన్షన్, జీత భత్యాలపై ఎన్నో అనుమానాలు తలెత్తాయి. దీనిపై ఉద్యోగ సంఘాలతో యాజమాన్యం జరిపిన చర్చల్లో సంఘాలు లేవనెత్తిన ప్రాథమిక ప్రశ్నలకు యాజమాన్యం సరైన సమాధానాలు ఇవ్వలేకపోయింది. దీంతో ఈ సమస్య నుంచి గట్టెక్కేందుకు, ఉద్యోగులను లోబర్చుకునేందుకు "కొత్త డిస్కామ్‌లో చేరితే తక్షణ ప్రమోషన్" అనే నిబంధనను ఉత్తర్వుల్లో చేర్చింది. ప్రస్తుత డిస్కామ్‌లలో దాదాపు 15 ఏళ్ల వరకు కొత్తగా ప్రమోషన్ వచ్చే అవకాశం లేకపోవడంతో, ప్రమోషన్ల కోసం ఈపీఎఫ్ ఉద్యోగులు భారీ ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. అయితే, ఇది తాత్కాలిక ప్రయోజనమే తప్ప భవిష్యత్తులో ఈ విభజన వల్ల పెద్ద ఎత్తున చిక్కులు రావడం ఖాయమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**కోర్టుకు వెళ్లకుండా కేవియెట్..**

రైతు డిస్కామ్ ఏర్పాటుపై లోపల ఎంత వ్యతిరేకత ఉన్నా, దీనిని ఎలాగైనా ప్రారంభించాలనే పట్టుదలతో ఉన్న ప్రభుత్వం.. అటువైపు నుంచి ఎలాంటి న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా ముందే ముందస్తు జాగ్రత్తలు తీసుకుంది. కొత్త డిస్కామ్‌లోకి ఉద్యోగుల విభజన ప్రక్రియపై ఉద్యోగ సంఘాలు ఎక్కడ కోర్టును ఆశ్రయించి స్టే తెస్తాయో అన్న భయంతో ప్రభుత్వం ముందే కోర్టులో 'కేవియెట్' దాఖలు చేసింది. ఇలా ఎన్నో ఆంక్షలు, నిర్బంధాలు, చట్టపరమైన రక్షణల మధ్య ఈ మూడవ డిస్కామ్‌ను బలవంతంగా పురిడు పోయించేందుకు సన్నాహాలు చేస్తుండటం ప్రభుత్వంలోని అభద్రతా భావానికి నిదర్శనమని విమర్శలు వస్తున్నాయి.

**ఉద్యోగుల పంపిణీ సరే.. మరి కొత్త ఉద్యోగాలేవీ?**

రెండు డిస్కామ్‌లను ముక్కలు చేసి ఏర్పాటు చేస్తున్న ఈ కొత్త రైతు డిస్కామ్ పరిధిలోకి దాదాపు 30 లక్షల వ్యవసాయ కనెక్షన్లు, ఐదున్నర లక్షల ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ బాధ్యత రానుంది. ఇంత భారీ నెట్‌వర్క్‌ను మెయింటెన్ చేయడం కోసం కేవలం వెయ్యి మంది కార్మికులను మాత్రమే బదిలీ చేస్తుండటం హాస్యాస్పదంగా మారింది. వేలాది సర్వీసులకు ఒక్కరే ఉద్యోగి చొప్పున పనిచేస్తే రైతులకు నాణ్యమైన సేవలు ఎలా అందుతాయన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. దీనికి తోడు కొత్త డిస్కామ్‌కు కావాల్సిన ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ సెంటర్లు (SPM), కస్టమర్ కేర్ సెంటర్లు, జిల్లా స్టోర్స్ వంటి మౌలిక వసతుల కల్పన ఎలా సాధ్యమనే దానికి యాజమాన్యం వద్ద ఎలాంటి సమాధానం లేదు. కొత్త డిస్కామ్ అంటున్నారే తప్ప, అందులోకి కొత్త ఉద్యోగాల నియామకాలు చేపట్టకపోవడం నిరుద్యోగులను, కేడర్‌ను మోసం చేయడమేనన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**రైతు డిస్కామ్ ముసుగులో ప్రైవేటీకరణ స్కెచ్?**

కొత్త డిస్కామ్ ఏర్పాటు వెనుక ఉన్న అసలు వ్యూహం ఉన్న డిస్కామ్‌ల ప్రైవేటీకరణేనన్న అనుమానాలు ఇప్పుడు బలంగా మారుతున్నాయి. ఈ ఆరోపణల్లో నిజం లేకపోలేదు. ఎందుకంటే, ఉన్న డిస్కామ్‌ల నుండి నష్టాల్లో నడిచే వ్యవసాయ రంగాన్ని, ఉచిత పథకాలను వేరు చేసి 'రైతు డిస్కామ్' పరిధిలోకి నెట్టేస్తే.. ఇక మిగిలిన రెండు డిస్కామ్‌లు పూర్తిగా కమర్షియల్, ఇండస్ట్రియల్, గృహ విద్యుత్ వినియోగదారుల ద్వారా లాభాల్లో నడిచే వ్యాపార సంస్థలుగా మిగులుతాయి. అలాంటప్పుడు లాభాల్లో ఉన్న ఆ రెండు డిస్కామ్‌లను కార్పొరేట్ సంస్థలకు, ప్రైవేట్ పరంచేయడం ప్రభుత్వానికి అత్యంత సులువవుతుంది. ప్రైవేటీకరణ కోసమే ప్రభుత్వం ఈ తరహా వ్యూహంతో అడుగులు వేస్తోందని ఉద్యోగ సంఘాలు బహిరంగంగానే ఆరోపిస్తున్నాయి.

ఈఆర్సీకి పోటెత్తిన అభ్యంతరాలు.. ఈ మూడవ డిస్కామ్ ఏర్పాటుపై ప్రజలు, మేధావులు, ఉద్యోగుల అభిప్రాయాలు, అభ్యంతరాలను స్వీకరించేందుకు తెలంగాణ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ఈ నెల 18 వరకు గడువు ఇచ్చింది. ఈ గడువులోగా వివిధ ప్రజా సంఘాలు, మేధావుల నుంచి ఏకంగా 32 రకాల ప్రధాన అభ్యంతరాలు ఈఆర్సీకి అందాయి. దాదాపు 90 శాతానికి పైగా వచ్చిన అభిప్రాయాలన్నీ ఈ కొత్త డిస్కామ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ వచ్చినవే కావడం గమనార్హం. ప్రభుత్వం మాత్రం కొత్త డిస్కామ్‌కు అనుమతి ఇవ్వాలని, విభజనకు సంబంధించిన ఆస్తులు, అప్పుల అంకెల గారడీని పొందుపరుస్తూ ఈఆర్సీకి దరఖాస్తు చేసుకుంది. అలాగే కొత్త డిస్కామ్‌లో చేరేందుకు ఖాళీల కంటే రెట్టింపు సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని ఈఆర్సీ మెప్పు పొందేందుకు ప్రయత్నిస్తోంది కానీ.. అంతర్గతంగా ఉద్యోగులు, రైతులు లేవనెత్తిన అసలు సమస్యలను ఎక్కడా ప్రస్తావించలేదు. ఇంతటి తీవ్ర వ్యతిరేకత, క్షేత్రస్థాయి లోపాల మధ్య ఈఆర్సీ ఈ ముళ్లకిరీటం లాంటి మూడవ డిస్కామ్‌కు అనుమతి ఇస్తుందా? లేదా అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని బ్రేక్ వేస్తుందా? అనేది ఇప్పుడు ఉత్కంఠ రేపుతోంది.

## తెలంగాణకు రూ.5 వేల కోట్లు ఇవ్వండి

- **కేంద్ర మంత్రికి భట్టి వినతి**

**న్యూఢిల్లీ, మే 20:**

తెలంగాణ అభివృద్ధి, విద్యా రంగ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతులు, విద్యా రంగ పెట్టుబడులపై కీలక చర్చలు జరిపారు.

ప్రత్యేక సహాయ పథకం కింద తెలంగాణకు అదనంగా రూ.5 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయం మంజూరు చేయాలని భట్టి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుకు మరింత ఆర్థిక మద్దతు అవసరమని కేంద్ర మంత్రికి వివరించారు. గత కొన్నేళ్లలో ప్రత్యేక ప్రయోజన సంస్థల ద్వారా తీసుకున్న అప్పుల భారం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోందని భట్టి తెలిపారు. అయినప్పటికీ విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

యంగ్ ఇండియా సమగ్ర నివాస పాఠశాలల ద్వారా విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాల వారీగా కొత్త వైద్య కళాశాలలు, గ్రామీణ ఆరోగ్య సేవల విస్తరణ, విద్యా మౌలిక వసతుల బలోపేతంపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు వెల్లడించారు.

విద్యా రంగ రూపాంతరానికి రూ.30 వేల కోట్ల పెట్టుబడి ప్రణాళిక రూపొందించినట్లు భట్టి తెలిపారు. ఇందులో 105 సమగ్ర నివాస పాఠశాలల నిర్మాణంతో పాటు ప్రభుత్వ కళాశాలలు, సాంకేతిక విద్యాసంస్థల అభివృద్ధి కూడా భాగమని పేర్కొన్నారు.

ఈ ప్రాజెక్టులకు సంబంధించిన రుణాలను రాష్ట్ర ఆర్థిక పరిమితుల నుంచి మినహాయించాలని కేంద్రాన్ని కోరారు. భవిష్యత్ తరాల విద్యా సాధికారత కోసం దీర్ఘకాలిక పెట్టుబడులు పెడుతున్నామని తెలిపారు. వికసిత భారత్ లక్ష్య సాధనలో తెలంగాణ విద్యా, మౌలిక వసతుల అభివృద్ధి కీలక పాత్ర పోషిస్తుందని భట్టి పేర్కొన్నారు.



## వరంగల్ జంట హత్యల కేసు..

- **నిందితుడికి మరణశిక్ష**

**వరంగల్, మే20:**

వరంగల్ జిల్లాలో చోటుచేసుకున్న ఒక పాశవిక జంట హత్యల కేసులో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి జె. మైత్రేయి నిందితుడికి మరణశిక్ష విధిస్తూ చారిత్రాత్మక తీర్పు వెలువరించారు. 2024 జూలై 10 అర్ధరాత్రి వేళ, చెన్నారావుపేట మండలం చింతల తండాలో జంట హత్యల ఘటన చోటుచేసుకుంది. గుండెంగ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మేకల నాగరాజు (బన్నీ), తండాకు చెందిన దీపికను ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే నాగరాజు ప్రవర్తన నచ్చక దీపిక పుట్టింటికి వచ్చేయడంతో, తన భార్యను దూరం చేశారనే పగతో నాగరాజు కక్ష పెంచుకున్నాడు.

అర్ధరాత్రి వేళ కత్తితో దీపిక కుటుంబంపై విచక్షణా రహితంగా దాడి చేయగా.. ఆమె తల్లి సుగుణ అక్కడికక్కడే, తండ్రి శ్రీను ఆసుపత్రి మార్గమధ్యంలో మృతి చెందారు. తీవ్ర గాయాలైన దీపిక, ఆమె సోదరుడు మదన్ ప్రాణాలతో బయటపడ్డారు. నెక్కొండ సీఐ శ్రీనివాస్ పక్కా సాక్ష్యాధారాలతో చార్జిషీట్ దాఖలు చేయగా, బాధితుల తరపున స్పెషల్ పీపీ బృందాదేవి వాదించారు. నిందితుడి చర్య అత్యంత పాశవికమైనదని, సమాజంలో ఇలాంటి నేరగాళ్లకు జీవించే హక్కు లేదని స్పష్టం చేస్తూ.. నిందితుడు నాగరాజుకు మరణించే వరకు ఉరిశిక్ష అమలు చేయాలని న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

## గ్లోబల్ టెక్ ట్రావెల్ క్లస్టర్‌గా హైదరాబాద్

- **సౌత్ వెస్ట్ ఎయిర్‌లైన్స్ ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు**

**హైదరాబాద్, మే 20:**




గ్లోబల్ టెక్ ట్రావెల్ క్లస్టర్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా ఈ రంగంలో దిగ్గజ కంపెనీలను ఆకర్షించేలా ఒక పటిష్ఠమైన ఎకో సిస్టంను అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైటెక్ సిటీలో అమెరికాకు చెందిన ప్రముఖ ఎయిర్ లైన్స్ సంస్థ సౌత్ వెస్ట్ ఎయిర్ లైన్స్ గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఆయన బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ విమానయానం, స్పేస్‌టెక్, డిఫెన్స్, డీప్‌టెక్ తదితర రంగాల్లో హైదరాబాద్ ఒక వ్యూహాత్మక కేంద్రంగా ఎదుగుతోందని వివరించారు. గత రెండేళ్ల వ్యవధిలో వ్యాన్‌గార్డ్, మారియట్ ఇంటర్నేషనల్, హెచ్‌సీఏ హెల్త్ కేర్, హార్ట్‌ఫోర్డ్, బీఏఎస్ఎఫ్ తదితర ఎన్నో దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌ను తమ గమ్యస్థానంగా ఎంచుకున్నాయన్నారు. తాజాగా ఈ జాబితాలో సౌత్ వెస్ట్ ఎయిర్స్ లైన్స్ కూడా చేరడం మనకు గర్వకారణమన్నారు. హైదరాబాద్ ఇన్నోవేషన్ ఎకో సిస్టంను మరింత బలోపేతం చేసేలా నేటి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా 'రెడీ టు వర్క్‌ఫోర్స్' తయారీపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ఆర్ అండ్ డీ, స్కిల్లింగ్, ఇన్నోవేషన్ తదితర అంశాల్లో దిగ్గజ సంస్థలతో కలిసి పనిచేసేందుకు ప్రత్యేక కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. తాజాగా ప్రారంభమైన ఈ గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ 'సౌత్ వెస్ట్ ఎయిర్ లైన్స్'కు ఒక స్ట్రాటజిక్ హబ్ గా పనిచేయనుంది. కంపెనీ గ్లోబల్ నెట్ వర్క్, సపోర్టింగ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఎంటర్ ప్రైజ్ కేపబిలిటీస్ తదితర అంశాల్లో కీలక సేవలు అందించనుంది. డీప్ టెక్, ఏఐ/ఎంఎల్, డేటా సైన్స్, డేటా అనలిటిక్స్, డిజిటల్ ఇంజినీరింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎంటర్‌ప్రైజ్ ప్లాట్‌ఫామ్స్ తదితర విభాగాల్లో నిపుణులైన వేయిమందికి ఉపాధి లభించనుంది.

# బండి సంజయ్‌కు బీజేపీ హైకమాండ్ అండ?

**హైదరాబాద్, మే 20**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌కు సంబంధించిన వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ అంశాన్ని ప్రధాన అస్త్రంగా చేసుకున్న బీఆర్ఎస్, బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు కూడా చేపడుతోంది.

అయితే ఈ వ్యవహారంలో తొలి రెండు రోజుల పాటు తెలంగాణ బీజేపీ నాయకత్వం సంయమనం పాటించినట్లు కనిపించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించినప్పటికీ తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేయలేదు. దీంతో పార్టీ హైకమాండ్ వైఖరిపై రాజకీయ వర్గాల్లో చర్చ నడిచింది.

కానీ తాజాగా బీజేపీ స్టాండ్ మార్చినట్లు స్పష్టమైంది. సోమవారం పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు బండి సంజయ్‌కు బహిరంగ మద్దతు ప్రకటించారు. సంజయ్ ఎలాంటి తప్పు చేయలేదని, రాజకీయ లాభం కోసం బీజేపీని లక్ష్యంగా చేసుకుంటే సహించబోమని హెచ్చరించారు.

కుటుంబ సభ్యులు తప్పు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారని, దానికి తండ్రిని బాధ్యుడిని చేయడం సరికాదని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కు ఈ అంశంపై మాట్లాడే నైతిక హక్కు లేదని మండిపడ్డారు.

ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జైలుకు వెళ్లిన సమయంలో కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. ఇప్పుడు బండి సంజయ్ రాజీనామా కోరడం రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.

ఇదే సమయంలో ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి కూడా ఈ వ్యవహారంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు పూర్తిగా రెండు కుటుంబాల మధ్య జరిగిన వివాదమని, దీనికి రాజకీయ రంగు పులమడం సరికాదని పేర్కొన్నారు. కొన్ని వీడియోలు తమ దృష్టికి వచ్చాయని, వాటిని పరిశీలిస్తే రెండు కుటుంబాల మధ్య ఎంత సాన్నిహిత్యం ఉందో అర్థమవుతుందని అన్నారు.

బాధిత యువతి కుటుంబం, భగీరథ్ కుటుంబం మధ్య గతంలో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని రాకేశ్ రెడ్డి తెలిపారు. చిన్నప్పటి నుంచి ఇరు కుటుంబాలు కలిసి తిరిగేవని, శ్రీశైలం, అరుణాచలం వంటి పుణ్యక్షేత్రాలకు కూడా కలిసి వెళ్లిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. పరిస్థితులు మారడంతో ఈ వివాదం బయటకు వచ్చిందని, చివరకు రెండు కుటుంబాలు కూర్చొని సమస్యను పరిష్కరించుకుంటాయనే నమ్మకం తనకు ఉందని పేర్కొన్నారు.

రామచంద్రరావు చేసిన వ్యాఖ్యలతో బండి సంజయ్‌కు బీజేపీ కేంద్ర నాయకత్వం పూర్తి మద్దతు ఉన్నట్లు స్పష్టమవుతోందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఢిల్లీ స్థాయిలో చర్చల అనంతరమే రాష్ట్ర బీజేపీ దూకుడు పెంచిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# ట్రంప్ దూకుడుకు అమెరికా సెనెట్ కత్తెర!

**ఇరాన్‌పై యుద్ధ హెచ్చరికల మధ్య అధ్యక్ష అధికారాలపై పరిమితులు**

**పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు.. ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు**

**ప్రపంచం మొత్తం ఆర్థిక సంక్షోభం, యుద్ధ భయాలు, ఆహార కొరతలతో వణుకుతున్న వేళ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం ఇరాన్‌పై యుద్ధ డప్పు మోగిస్తూనే ఉన్నారు. "చర్చలు విఫలమైతే రెండు మూడు రోజుల్లోనే దాడులు ప్రారంభమవుతాయి" అంటూ ట్రంప్ చేసిన హెచ్చరికలు అంతర్జాతీయంగా కలకలం రేపుతున్నాయి.**

ప్రపంచం అతలాకుతలం అవుతున్నా..తనకేమీ పట్టనట్టు ట్రంప్ మహాశయుడు ఫిడేల్ వాయిస్తున్నాడు. యుద్ధం ..యుద్ధం అంటూ కలవరిస్తున్నారు. ఇరాన్‌పై దాడులు తప్పవని హెచ్చరిస్తున్నాడు. అయితే పశ్చిమాసియా యుద్ధానికి సంబంధించి తాజాగా తీవ్ర ఉత్కంఠ పరిణామాలు చకచకా చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం తెరవెనక సాగుతున్న చర్చల్లో ఒప్పందం కుదరకుంటే... 2-3 రోజుల్లోనే.. లేదంటే వచ్చే వారం ఆరంభంలో తాము ఇరాన్‌పై దాడులతో విరుచుకుపడతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. దీంతో మరోమారు ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇప్పటికే అమెరికా సహా అన్ని దేశాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నా ట్రంప్ మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై ఆయన దూకుడు ప్రవర్తనకు అమెరికా సెనెట్ కళ్ళెం వేసింది. అధ్యక్షుడి యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి తాజాగా ఆమోదం లభించింది. దీంతో అయినా ట్రంప్ దూకుడు ఆగతుందా అన్నది చూడాలి. ఇకపోతే ఇరాన్‌తో భారీస్థాయిలో చర్చలు జరుగుతున్నాయని, అవి సఫలమై.. మా దాడి ప్రణాళిక శాశ్వతంగా అటకెక్కుతుందని ఆశిస్తున్నా అంటూ ట్రంప్ తాజాగా వెల్లడించాక ఈ తీర్మనం వచ్చింది. టెహ్రాన్ చేతికి అణ్వాయుధాలు దక్కకుండా ఉండే ఒప్పందం మాకు ఆమోదయోగ్యమవుతుందని శ్వేతసౌధంలో విలేకర్లతో మాట్లాడుతూ ట్రంప్ పేర్కొన్నారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై భారీ స్థాయిలో వెంటనే దాడులు చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని తమ అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. మంగళవారమే భారీ స్థాయిలో దాడులు జరపాలనుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. అయితే అరబ్ దేశాల నేతల విజ్ఞప్తి మేరకు చివరి నిమిషాల్లో ఆ ప్రణాళికను తాత్కాలికంగా పక్కనపెట్టానన్నారు. టెహ్రాన్‌తో చర్చలు సీరియస్‌గా సాగుతున్నాయని, అందరికీ ఆమోదయోగ్యమైన ఒప్పందం కుదిరే అవకాశాలు ఉండటం వల్లే దాడుల నిర్ణయాన్ని ప్రస్తుతానికి ఉపసంహరించుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో ట్రంప్ వ్యవహాఇర శైలి చూస్తుంటే ఆయన దేనికైనా తెగిస్తాడని అనుకోవాలి. ఇకపోతే ఇరాన్ కూడా గట్టిగానే సమాధ్రానం ఇస్తోంది. అమెరికా-ఇజ్రాయెల్ మళ్లీ దాడులు చేస్తే.. తాము యుద్ధరంగంలో కొత్త సాధనాలతో, సరికొత్త విధానాల్లో విరుచుకుపడతామని ఇరాన్ హెచ్చరించింది. తమను దిగ్బంధించడం, ఓడించడం ఎవరికీ సాధ్యం కాదని పేర్కొంది. టెహ్రాన్‌లోని వాలియాస్ స్క్వేర్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో ఆ దేశ సైన్యాధికారి బ్రిగేడియర్ జనరల్ మహమ్మద్ అక్రమినియా ఈ వ్యాఖ్యలు చేశారు. తమ సాయుధ దళాలు గతంలో కంటే ఇప్పుడు మరింత బలంగా, సన్నద్ధంగా ఉన్నాయని ఇరాన్ పేర్కొంది. సైన్యం ట్రిగ్గర్‌పై వేలు పెట్టి సిద్ధంగా ఉందని హెచ్చరించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులను హతమారిస్తే.. 58 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.560 కోట్లు) బహుమతిగా ఇస్తామని ఇరాన్ త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు 'ఇస్లామిక్ రిపబ్లిక్ భద్రతా దళాల ప్రతిచర్య' పేరిట బిల్లును సిద్ధం చేస్తున్నట్లు ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ ఛైర్మన్ ఇబ్రహీమ్ అజీజ్ తెలిపారు. దీనిపై త్వరలోనే పార్లమెంటులో ఓటింగ్ నిర్వహిస్తామన్నారు. తమ దేశంలోని బరకాహ్ అణు విద్యుత్కేంద్రంపై ఇటీవల దాడి చేసిన డ్రోన్లు ఇరాక్ భూభాగం నుంచి దూసుకొచ్చాయని యూఏఈ రక్షణ శాఖ మంగళవారం వెల్లడించింది. ఇరాన్ మద్దతున్న షియా మిలీషియాలు వాటిని ప్రయోగించి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ ఇటీవల చేసిన దాడులు పర్యావరణానికి హానికరంగా మారి, జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరాన్ ఆయిల్ రిఫైనరీపై జరిగిన ఓ దాడితో సముద్ర జలాల్లోకి చమురు చేరి.. అలల ద్వారా పర్షియన్ గల్ఫ్‌లోని శిద్వార్ దీవిపైకి కొట్టుకొచ్చింది. అది జనావాసాల్లేని దీవి. వన్యప్రాణులు చాలానే ఉన్నాయి. చమురు వ్యాప్తితో వాటి మనుగడకు సమస్యలు తలెత్తుతున్నాయి. ఇవన్నీ ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయి. అమెరికా దూకుడు తగ్గకుంటే ప్రపంచంలో ఆర్థిక, ఆహార సంక్షోభం తీవ్రం కానుంది. ఇప్పటికే గల్ఫ్ దేశాలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నాయి. ఇది మరింత తీవ్రం అయ్యే ప్రమాదం ఉంటి. ఖతార్ లాంటి దేశాల్లో ఆహార కొరత తీవ్రంగా ఉంది. వారి వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో శాంతి చర్చలకు ప్రపంచ దేశాలు ఒత్తిడి చేయాల్సిన అవసరం ఉంది.

# చంద్రయాన్-3 మరో సంచలనం

- విక్రమ్ ల్యాండర్ కీలక ఆవిష్కరణ
- విక్రమ్ ల్యాండింగ్ సమయంలో కీలక విషయం వెలుగులోకి..



**బెంగళూరు:** ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 మిషన్ మరో కీలక శాస్త్రీయ ఆవిష్కరణకు దారితీసింది. విక్రమ్ ల్యాండర్ చేసిన చిన్న 'హాప్ ఎక్స్‌పెరిమెంట్' చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంత ఉపరితలం గురించి కొత్త వివరాలను బయటపెట్టింది. మిగిలిపోయిన ఇంధనాన్ని ఉపయోగించుకోవాలనే అనూహ్య నిర్ణయంతో ఈ ప్రయోగం చేపట్టారు. చంద్రుడిపై శివశక్తి పాయింట్ వద్ద ఉన్న నేల గతంలో భావించిన దానికంటే చాలా వైవిధ్యమైనదని, సంక్లిష్టమైనదని వెల్లడించే ఒక మైలురాయిగా ఈ ప్రయోగం నిలిచింది. ఈ ప్రయోగంలో ల్యాండర్ సుమారు 40 నుంచి 50 సెంటీమీటర్లు పైకి ఎగిరి, కొద్దిదూరం పక్కకు వెళ్లి మళ్లీ సాఫ్ట్‌గా ల్యాండ్ అయింది. ఈ ప్రయోగం వల్ల చంద్రుడి ఉపరితలంపై ఉన్న పై పొర తొలగిపోయి, లోపలి మట్టిని చంద్ర సర్ఫేస్ థర్మోఫిజికల్ ఎక్స్‌పెరిమెంట్ పరికరం పరిశీలించే అవకాశం లభించింది. దీంతో చంద్రుడి మట్టి ఒకేలా కాకుండా పలు పొరలుగా ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. పైభాగం పొర చాలా మెత్తగా ఉండగా, కింద భాగం మరింత ఘనంగా ఉందని అధ్యయనం తెలిపింది. ఈ సమాచారం భవిష్యత్ చంద్ర మిషన్లకు చాలా కీలకంగా మారనుంది. ముఖ్యంగా నాసా ఆర్టెమిస్ మిషన్ ద్వారా చంద్రుడిపై శాశ్వత స్థావరం ఏర్పాటు చేయాలనే ప్రణాళికలకు ఈ డేటా ఉపయోగపడనుందని నిపుణులు చెబుతున్నారు. 2023 జులై 14న ప్రయోగించిన చంద్రయాన్ 3, చంద్రుని దక్షిణ ధృవం ఉపరితలంపై సురక్షితంగా ల్యాండ్ అయి ప్రపంచాన్ని అబ్బురపరిచింది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన మొట్ట మొదటి దేశంగా భారత్ నిలిచింది.

# లంచగొండి అధికారులపై ఫిర్యాదు చేస్తే రూ.లక్ష బహుమతి!

**అవినీతి నిర్మూలనపై సీఎం విజయ్ ఫోకస్**

**ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యం**

**ప్రభుత్వ శాఖలకు మూడు నెలల గడువు**

**చెన్నై, మే 20:** తమిళనాడులో అవినీతిని అరికట్టేందుకు సీఎం విజయ్ ప్రభుత్వం కీలక చర్యలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం డిమాండ్ చేసే అధికారులపై ప్రజలు ఫిర్యాదు చేస్తే వారికి రూ.1 లక్ష వరకు బహుమతి ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. అవినీతి అధికారులపై నేరుగా ప్రజల నుంచే సమాచారం సేకరించే విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేక హెల్ప్‌లైన్, ఆన్‌లైన్ పోర్టల్, ఫిర్యాదు వ్యవస్థను ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఫిర్యాదు చేసే వారి వివరాలను పూర్తిగా రహస్యంగా ఉంచుతామని ప్రభుత్వం హామీ ఇస్తున్నట్లు సమాచారం. అవినీతి నిరోధక శాఖలో కూడా సమూల మార్పులు తీసుకురావాలని సీఎం విజయ్ ఆదేశించినట్లు తెలుస్తోంది. శాఖలో రాజకీయ జోక్యం, అంతర్గత అవినీతి వ్యవహారాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, పోలీస్, మున్సిపల్, ట్రాన్స్‌పోర్ట్ శాఖల పనితీరుపై ప్రత్యేక నిఘా పెట్టే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. టెండర్లు, కాంట్రాక్టులు, ఉద్యోగ నియామకాలలో పారదర్శకత తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సమాచారం. "ప్రజల డబ్బు పవిత్రమైనది.. అవినీతి చేసేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టం" అంటూ అధికారులకు సీఎం విజయ్ గట్టి హెచ్చరిక జారీ చేసినట్లు తెలుస్తోంది.






# ట్రంప్ దూకుడుకు సెనెట్ కళ్లెం

**యుద్ధ అధికారాలను పరిమితం చేస్తూ తీర్మానం**

**వాషింగ్టన్, మే 20:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై ఆయన దూకుడు ప్రవర్తనకు అమెరికా సెనెట్ క్లళెం వేసింది. అధ్యక్షుడి యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి తాజాగా ఆమోదం లభించింది. ఫిబ్రవరి చివరిలో ఇజ్రాయెల్‌తో కలిసి ట్రంప్ ఇరాన్ పై యుద్ధానికి దిగారు. యుద్ధంపై ట్రంప్ అధికారాలను పరిమితం చేసేందుకు డెమోక్రట్లు అనేకసార్లు సెనెట్‌లో ఓటింగ్ నిర్వహించారు. అయితే, వారి తీర్మానాలకు తగినంత ఓటింగ్ లభించలేదు. డెమోక్రటిక్ సెనెటర్ టిమ్ కెయిన్ తాజాగా మరోసారి సెనెట్ ముందుకు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. యుద్ధ ప్రకటన, సైనిక చర్యకు కాంగ్రెస్ నుంచి స్పష్టమైన ఆమోదం లభిస్తే తప్ప.. ఇరాన్ లోపల లేదా దానికి వ్యతిరేకంగా జరిగే ఘర్షణల్లో యూఎస్ దళాలు పాల్గొనకూడదని అందులో తెలిపారు. దీనికి 50 మంది అనుకూలంగా.. 47 మంది వ్యతిరేకంగా ఓట్లు వేశారు. ఈ తీర్మానం ఆమోదంలో నలుగురు రిపబ్లికన్ సభ్యులు కూడా మద్దతుగా ఓటు వేయడం గమనార్హం. కాగా.. ఈ బిల్లు ఆమోదానికి సంబంధించి త్వరలో తుది ఓటింగ్ జరగనుంది. ఇది చట్టంగా మారితే.. కాంగ్రెస్ అధికారికంగా సైనిక దాడి కొనసాగించడానికి అనుమతి ఇచ్చేవరకు ట్రంప్ ఇరాన్‌పై ఎలాంటి దాడులకు దిగకూడదు. ఓటింగ్ సందర్భంగా డెమోక్రటిక్ సెనెట్ చక్ షుమర్ మాట్లాడుతూ.. యుద్ధానికి సంబంధించిన నిర్ణయాలపై కాంగ్రెస్ తిరిగి పర్యవేక్షణ చేపట్టాలన్నారు. 'ఈ అధ్యక్షుడు నిండుగా తూటాలున్న తుపాకీతో ఆడుకుంటున్న చిన్నపిల్లాడిలా ఉన్నాడు' అని వ్యాఖ్యానించారు. అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చలు కొనసాగుతోన్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ప్రభుత్వ రాయితీ పొందిన ఆస్పత్రులకు హెచ్చరిక

**పేదలకు ఉచిత వైద్యం అందించాల్సిందే అన్న సుప్రీం**

**న్యూఢిల్లీ, మే 20:** సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ భూములను రాయితీ ధరలకు పొందిన ప్రైవేట్ ఆస్పత్రులు ఆర్థికంగా బలహీన వర్గాలకు తప్పనిసరిగా ఉచిత వైద్య సేవలు అందించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఢిల్లీ ప్రభుత్వానికి ప్రామాణిక కార్యాచరణ విధానం రూపొందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఢిల్లీలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇచా రోగులకు ఉచిత చికిత్స అమలు విషయంలో కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. గతంలో కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ 51 ఆస్పత్రుల్లో కేవలం నాలుగు ఆస్పత్రులే నిబంధనలు పాటిస్తున్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రైవేట్ ఆస్పత్రులు తమ ఇన్‌పేషెంట్ విభాగంలో 10 శాతం, అవుట్‌పేషెంట్ విభాగంలో 25 శాతం వరకు ఉచిత చికిత్స అందించడం తప్పనిసరని మరోసారి స్పష్టం చేసింది. 2018లో ఇచ్చిన తీర్పును సమర్థవంతంగా అమలు చేయడానికి స్పష్టమైన ఈూక్షఖ రూపొందించాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. న్యాయస్థానం తీర్పును ఉల్లంఘించినట్లు తేలిన 51 ఆస్పత్రుల్లో మ్యాక్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వేంకటేశ్వర, మూల్ చంద్ హాస్పిటల్స్ ఉన్నాయి. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినట్లు తేలిన ఆస్పత్రులపై గతంలో ధిక్కరణ నోటీసులు జారీ చేసినట్లు వెల్లడైంది. ఈ అంశంపై ఢిల్లీ ప్రభుత్వం, సంబంధిత అధికారులు, ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మే 23వ తేదీన ఢిల్లీ సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. 'యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ మూల్‌చంద్ ఖైరతీ రామ్ ట్రస్ట్' కేసులో జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్వీ అంజారియాతో కూడిన ధర్మాసనం ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది.



# జనగణనలో కులగణనకు సుప్రీం ఓకే

**వ్యతిరేకిస్తూ వచ్చిన పిటిషన్లు తిరస్కరణ**



**న్యూఢిల్లీ, మే 20:** కులగణనపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. జనగణనలో కులాల లెక్కింపునకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనం అనుమతి ఇచ్చింది. కులగణనను వ్యతిరేకిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ధర్మాసనం కొట్టివేసింది. ఈ మేరకు బుధవారం జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించారు. సంక్షేమ పథకాల అమలుకు కులగణన తప్పనిసరి అని స్పష్టం చేసింది. కుల గణన ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని పేర్కొంది. ఈ అంశంలో కోర్టుల జోక్యం ఉండదని స్పష్టం చేసింది. జన గణన.. కుల ప్రాతిపదికన జరగాలా వద్దా అనేది విధానపరమైన నిర్ణయమని పేర్కొంది. వెనుకబడిన తరగతికి చెందిన వారు ఎంతమంది ఉన్నారో ప్రభుత్వం తెలుసుకోవాల్సి ఉందని ఈ ధర్మాసనం వ్యాఖ్యానించింది. నగణన నుంచి కులగణనను మినహాయించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ఈ సందర్భంగా ధర్మాసనం తిరస్కరించింది. ఈ అంశం ప్రభుత్వ విధాన పరిధిలోకి వస్తుందని వివరించింది. అందులో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని తెలిపింది. ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జయమల్యా బాగ్చీ, విపుల్ పంచోలీతో కూడిన ధర్మాసనం విచారించింది.

# ఎరువులు, పెట్రోల్, గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి: న్యూ డెమోక్రసీ

**కేంద్రం కార్పొరేట్ విధానాలతో ప్రజలు దివాలా తీస్తున్నారు: బజ్జూరి వెంకటరామిరెడ్డి**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎరువులు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పాలేరు డివిజన్ కార్యదర్శి బజ్జూరి వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కూసుమంచిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ ధరల పెంపుతో కార్మికులు, కర్షకులు, సామాన్య ప్రజలపై కోట్లాది రూపాయల భారం పడి దివాలా తీసే పరిస్థితి వస్తోంది. కేంద్రం గత 12 ఏళ్లుగా కార్పొరేట్లకు అనుకూల విధానాలు అవలంబిస్తూ ప్రజల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది" అని మండిపడ్డారు.భారతదేశ మిత్ర దేశమైన ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా చేస్తున్న అప్రజాస్వామిక దాడిని ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశ అధినేత మోదీ గారు ఖండించకపోవడం శోచనీయం" అని ఆయన అన్నారు.పంటలకు మద్దతు ధర రూపాయల్లో పెంచి, ఎరువుల ధరలు వందల్లో పెంచి కేంద్ర ప్రభుత్వం రైతుల పట్ల తన చిత్తశుద్ధిని చాటుకుంది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, పేపర్ లీకులతో 23 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తరుగు, కండిషన్లు లేకుండా మొక్కజొన్న, వరిని కొనుగోలు చేయాలని కోరారు. వర్షాలకు రైతులు టెన్షన్‌కు గురై మధ్య దళారులకు సగం రేటుకు అమ్ముకుంటున్నారని తెలిపారు.ఈ సమావేశంలో న్యూ డెమోక్రసీ కూసుమంచి సబ్ డివిజన్ కార్యదర్శి ఐ. వెంకన్న, కే. సురేష్, చెరుకుపల్లి వీరయ్య, బుర్ర సైదులు, బత్తుల ఉప్పలయ్య, నిమ్మల వెంకన్న, దాట్ల వీరస్వామి, పోకల వెంకన్న, ఆర్. సంజీవరావు, పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు కే. కల్పన తదితరులు పాల్గొన్నారు.

# బగ్గుమంటున్న సూర్యుడు - అల్లాడుతున్న బతుకులు

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** మే నెల మండుతోంది. సూర్యుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. ఉదయం 9 గంటలకే రోడ్డుపై కాలు పెడితే కాళ్లు కాలిపోతున్నాయి. మధ్యాహ్నం 12 అయ్యేసరికి ఊళ్లన్నీ స్మశానాన్ని తలపిస్తున్నాయి. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలో గత మూడు రోజులుగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. చెట్ల నీడ కోసం పక్షులు సైతం వెతుక్కుంటున్నాయి. మనుషుల పరిస్థితి చెప్పనక్కర్లేదు.

**కాలిపోతున్న బతుకులు**

రెక్కాడితేగాని డొక్కాడని బతుకులు ఎండకు మాడిపోతున్నాయి. ఉపాధి హామీ కూలీలు తెల్లవారుజామునే పనికి వెళ్లి, 10 గంటలకల్లా ఇళ్లకు చేరుతున్నారు. "ఎండకు తట్టుకోలేకపోతున్నాం. పని చేయకపోతే పూట గడవదు. చేస్తే ప్రాణం పోతుంది" అని కూసుమంచికి చెందిన కూలీ మల్లమ్మ కన్నీళ్లు పెట్టుకుంది. రైతుల పరిస్థితి మరీ దారుణం. వరి నాట్లకు పొలం దమ్ము చేయాలని వెళ్లిన రైతు వడదెబ్బకు గురై ఆసుపత్రి పాలయ్యాడు. "పొద్దున 6 గంటలకు పొలం వెళ్లిన. 9కల్లా తల తిరిగి పడిపోయిన" అంటూ ఆయన చెప్పాడు.

**నిర్మానుష్యమైన బజార్లు**

మధ్యాహ్నం 12 దాటితే ఖమ్మం బస్టాండ్, రైతు బజార్, గాంధీ చౌక్ అంతా బోసిపోయి కనిపిస్తున్నాయి. తోపుడు బండ్ల వ్యాపారులు, కూరగాయలు అమ్మేవాళ్లు చెట్ల కిందకు చేరిపోయారు. "ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలే వ్యాపారం. మిగతా సమయం ఎండకు కూర్చోలేక ఇంటికి పోతున్నాం" అని పండ్ల వ్యాపారి రమేష్ వాపోయాడు. ఆటో డ్రైవర్లు సీట్లపై నీళ్లు చల్లుకుంటూ, తడి టవల్ తలకు చుట్టుకుని బతుకు బండి లాగిస్తున్నారు. "ఒక్కో కిరాయి కూడా రావడం లేదు. అయినా ఇంట్లో కూర్చుంటే తినేదేముంది" అని ఆటో డ్రైవర్ ఆవేదన వ్యక్తం చేశాడు.

**ఆసుపత్రులకు క్యూ**

ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి ఓపీకి వడదెబ్బ బాధితుల తాకిడి పెరిగింది. రోజుకు 30-40 మంది డీహైడ్రేషన్, వాంతులు, విరేచనాలతో వస్తున్నారని డాక్టర్లు చెబుతున్నారు. "చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు చాలా జాగ్రత్తగా ఉండాలి. మధ్యాహ్నం బయటకు వెళ్లొద్దు. మజ్జిగ, కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్ తాగాలి" అని జనరల్ ఫిజీషియన్ డాక్టర్లు సూచించారు.

**అసలు కారణం ఏంటి?**

వాతావరణ శాఖ చెబుతున్న దాని ప్రకారం ఉత్తరాది నుంచి వీస్తున్న వేడిగాలులు, వర్షాభావ పరిస్థితులే ఈ అధిక ఉష్ణోగ్రతలకు కారణం. చెట్లు నరికివేత, కాంక్రీట్ జంగిల్ పెరగడం, వాహన కాలుష్యం కూడా తోడయ్యాయి. ఒకప్పుడు ఊరి చివర చెరువు, మధ్యలో పెద్ద మర్రిచెట్టు ఉండేవి. ఇప్పుడవన్నీ కనుమరుగైపోయాయి.

**ఏం చేయాలి?**

మున్సిపాలిటీ వారు కూడళ్లలో చలివేంద్రాలు పెట్టారు. పంచాయతీలు ట్యాంకర్లతో నీళ్లు సరఫరా చేస్తున్నాయి. కానీ ఇవి తాత్కాలిక ఉపశమనం మాత్రమే. శాశ్వత పరిష్కారం కావాలి. ప్రతి ఇంటికి ఒక చెట్టు, ప్రతి ఊరికి ఒక పచ్చదనం అనే నినాదం నిజం కావాలి. సూర్యుడు బగ్గుమంటున్నాడు నిజమే. కానీ మనం చెట్లు నరికి, నీటిని వృధా చేసి, భూమిని కాంక్రీట్‌గా మార్చి ఆ మంటను మరింత పెంచుతున్నాం. ప్రకృతిని కాపాడుకోకపోతే, రేపు మన బతుకులే బుగ్గిపాలు కావడం ఖాయం. ఈ ఎండాకాలం మనకు ఒక హెచ్చరిక. మేల్కొందాం. చెట్టు నాటుదాం. నీటిని ఒడిసి పడదాం.

# ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

- **మెగా జాబ్ మేళాలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం మావల మండల కేంద్రంలోని చిలుకూరి లక్ష్మి గార్డెన్లో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటిడిఏ పీవో మంద మకరందు, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూషలతో కలిసి ప్రారంభించారు. నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ జాబ్ మేళాకు జిల్లా నలుమూలల నుంచి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లొమా పూర్తి చేసిన 7,611 మంది అభ్యర్థులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గాలను చూపించేందుకు ఒకే వేదికపై 63 ప్రముఖ కంపెనీలను 16వేల ఉద్యోగ అవకాశాలతో తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం డిగ్రీలు మాత్రమే సరిపోవని, యువత సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసమే ఎదురు చూడకుండా ప్రైవేట్ రంగంలో లభించే అవకాశాలను కెరీర్లో ఒక మెట్టుగా భావించి ముందుకు సాగాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల యువత అధైర్యపడకుండా ఆత్మవిశ్వాసంతో ఇంటర్వ్యూలను ఎదుర్కొని ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో జిల్లా యంత్రాంగం, నైపుణ్యాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని, యువత ఉపాధి సాధనలో జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ యువత తమ ప్రతిభను నిరూపించుకుని ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రైవేట్ రంగంలో వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. నిరుద్యోగుల సంక్షేమం కోసం మరిన్ని ఉపాధి కార్యక్రమాలు, ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ జాబ్ మేళాలో పలు ప్రముఖ ఐటీ, బ్యాంకింగ్, ఫార్మా, మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించగా, మొత్తం 1,775 మంది అభ్యర్థులు వివిధ దశల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిలో 159 మందికి అతిథుల చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. మరో 680 మంది తుది ఎంపిక కాగా, 936 మంది అభ్యర్థులు తదుపరి పరిశీలన కోసం షార్ట్లిస్ట్ అయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధికల్పన అధికారి మిల్కా, డివైఎస్ఓ శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, యువతీ, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి–ఖమ్మం మధ్య 3 స్టాప్స్ డీలక్స్ సర్వీసులు ప్రారంభం




**రాజముద్ర న్యూస్, సత్తుపల్లి:** సత్తుపల్లి నుంచి ఖమ్మం వరకు ప్రతిరోజూ 3 స్టాప్స్ డీలక్స్ బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం నుంచి ఈ ప్రత్యేక డీలక్స్ సర్వీసులు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. సత్తుపల్లి–ఖమ్మం మార్గంలో నడిచే ఈ డీలక్స్ బస్సులకు వీఎం బంజర, కల్లూరు, వైరా వద్ద మాత్రమే స్టాపులు కల్పించినట్లు తెలిపారు. దీంతో సత్తుపల్లి నుంచి ఖమ్మం, ఖమ్మం నుంచి సత్తుపల్లికి ప్రయాణించే వారికి సమయం ఆదా అవుతుందని పేర్కొన్నారు.

**బస్సుల వివరాలు..**

సత్తుపల్లి నుంచి ఖమ్మం వైపు ఉదయం 7, 7.30, 8 గంటలకు, మధ్యాహ్నం 11.45, 12.15, ఒంటి గంటలకు, సాయంత్రం 4.30, 5, 5.40 గంటలకు బస్సులు బయలుదేరనున్నాయని పేర్కొన్నారు. అలాగే ఖమ్మం నుంచి సత్తుపల్లి వైపు ఉదయం 9.20, 9.45, 10.15 గంటలకు, మధ్యాహ్నం 2.15, 2.50, 3.30 గంటలకు, సాయంత్రం 6.40, 7.15, 8 గంటలకు డీలక్స్ బస్సులు నడుస్తాయని తెలిపారు. సత్తుపల్లి డిపో పరిధిలోని ప్రయాణికులు ఈ ప్రత్యేక సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**రాజముద్ర న్యూస్, నేరడిగొండ:** ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆరోగ్య పర్యవేక్షకులు ఎ.సంతోష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'పీఎం జన్మన్'క్యాంపెయిన్ లో భాగంగా బుధవారం మండలంలోని బోరిగాం గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. శిబిరంలో స్థానిక ప్రజలకు ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బోరిగాం సర్పంచ్ రాథోడ్ వినీష్, పిఎస్. మనోహర్, ఆశా కార్యకర్త కమల, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## నారాయణ పాఠశాలకు అనుమతి లేదు

**మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి**

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** మేడిపల్లి మండల పరిధిలోని బోడుప్పల్ నారాయణ పాఠశాల కు అనుమతులు లేవని అందులో 2026-27 ఏడాది కి గాను ఏలాంటి అడ్మిషన్ తీసుకోవద్దని మేడిపల్లి మండల విద్యా అధికారి శ్రీనివాస్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఆ పాఠశాలకు ఉన్న ప్రభుత్వ గుర్తింపు గడువు ముగిసిందని తెలిపారు. ఈ సంవత్సరం రెన్యువల్ కు సరైన పత్రాలు సమర్పించని కారణంగా బోడుప్పల్ నారాయణ పాఠశాల పునరుద్ధరణ ను చేయలేకపోయామని అధికారులు తెలిపారు.

## ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** కూసుమంచి మండల కేంద్రంలో సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను బుధవారం అభిమానులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు.అనంతరం బస్టాండ్ సెంటర్లో వేసవి దృష్ట్యా ప్రయాణీకులకు,ప్రజలకి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఐతగాని నవీన్ మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో తమ అభిమాన హీరో పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తూ,సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.తమ అభిమానించే నటుడు నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు.రానున్న కాలంలో సమాజానికి ఉపయోగపడే సందేశాత్మక సినిమాలు తీయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యాక్షులు తాహేర్ హుస్సేన్,అడపా శివ(కరాటే శివ),సతీష్, ఉదయ్, సాయి, నాగరాజు, రామకృష్ణ, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఐమాక్స్ లైట్ల ప్రారంభం



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం కేంద్రంలోని స్కూల్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని 1వ వార్డు, 6వ వార్డులో నూతన ఐమాక్స్ లైట్లు గ్రామ సర్పంచ్ బుచ్చి రెడ్డి గారి ఆధ్వర్యంలో ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి దిశగా వీధులలో వెలుగులు ప్రసరించే విధంగా ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్లు ప్రజలకు రాత్రి సమయంలో భద్రతతో పాటు సౌకర్యాన్ని కల్పించనున్నాయి. గ్రామ ప్రజలు ఈ కార్యక్రమాన్ని హర్షాతిరేకంతో స్వాగతించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గంగావత్ రమేష్ , వార్డు సభ్యులు సరిత రంజిత్, భూలి బాలు నాయక్, లలిత నరేష్, సంతోష్, తిరుపతి, సుజాత భోజ,తదితరులు పాల్గొన్నారు.గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతంగ కొనసాగుతాయని సర్పంచ్ తెలిపారు.

## బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ కు సన్మానం

**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్గా వరుసగా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన మల్లెపూల సత్యనారాయణను కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సంజీవరెడ్డి మాట్లాడుతూ మల్లెపూల సత్యనారాయణ నాయకత్వంలో బోథ్ మార్కెట్ కమిటీ మరింత అభివృద్ధి సాధిస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. వరుసగా రెండోసారి చైర్మన్గా బాధ్యతలు చేపట్టడం ఆయన సమర్థతకు నిదర్శనమని కొనియాడారు. రైతులకు మార్కెట్ కమిటీ ద్వారా మెరుగైన సేవలు అందేలా పాలకవర్గం కృషి చేయాలని సూచించారు. అనంతరం మల్లెపూల సత్యనారాయణను శాలువాతో సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు అంబకంటి అశోక్ కుమార్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్, బోరిగాం సర్పంచ్ ఆసిఫ్ ఖాన్, యాకూబ్తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంచార్జిల పాలనతో కల్లూరు పశువైద్య కేంద్రం అస్తవ్యస్తం

**శాశ్వత వైద్యుడు లేక పాడి రైతుల అవస్థలు**

**రాజముద్ర న్యూస్, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా కల్లూరు డివిజన్ కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో గత మూడు సంవత్సరాలుగా శాశ్వత వైద్యుడు లేకపోవడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఇంచార్జి వైద్యులతోనే సేవలు కొనసాగుతుండటంతో పశువులకు సమయానికి చికిత్స అందక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనారోగ్యానికి గురయ్యే పశువులను చికిత్స కోసం కేంద్రానికి తీసుకువస్తున్నప్పటికీ సరైన వైద్య సేవలు అందడం లేదని వాపోతున్నారు. అత్యవసర సమయాల్లో వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. దీంతో అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పశువైద్య కేంద్రంలో సిబ్బంది కొరతతో పాటు అవసరమైన మందులు కూడా సరిపడా లేవని ఆరోపించారు. ముఖ్యంగా పాడి పరిశ్రమపై ఆధారపడిన కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కల్లూరు పశువైద్య కేంద్రానికి శాశ్వత వైద్యుడిని నియమించి, పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలని పాడి రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# సంక్షేమ పథకాల అమలులో సమన్వయంతో పనిచేయాలి

- వీసీ ద్వారా సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ ఆదేశాలు



**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** సంక్షేమ పథకాల అమలులో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలని సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రామీణాభివృద్ధి, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులతో కలిసి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్య దేవరాజన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ఆర్థిక పురోభివృద్ధికి దోహదపడే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద కూలీల సంఖ్యను గణనీయంగా పెంచాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ నిర్దేశించిన రుణాల లక్ష్యాలను వంద శాతం సాధించాలని, కొత్త మహిళా సంఘాల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. గ్రామీణ యువత, బాలికల సాధికారత కోసం 15 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల వారితో 'స్నేహ'గ్రూపులను తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సకాలంలో అందేలా ఆసరా, చేయూత పెన్షన్ దారులకు సంబంధించిన ఫేస్ అథెంటికేషన్, డెత్, మైగ్రేషన్ ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం పెన్షన్లు పొందుతున్న వారి వివరాలను పారదర్శకంగా కొనసాగించేందుకు లైవ్ ఫేస్ అథెంటికేషన్, అర్హతల క్షేత్రస్థాయి వెరిఫికేషన్ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని పేర్కొన్నారు. అలాగే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్బీఎస్) కింద అందించే రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అర్హులైన కుటుంబాలకు ఎలాంటి జాప్యం లేకుండా అందేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. సంక్షేమ పథకాల అమలులో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్డీఓ రవీందర్ రాథోడ్, జిల్లా పరిషత్ సీఈఓ రవి, డీపీఓ రమేష్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఎంపీడీఓలు, సెర్ప్, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్న మాజీ జెడ్పీటీసీ

- ఉండంలో శరవేగంగా గంగపుత్ర కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు




**రాజముద్ర న్యూస్, తలమడుగు:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజాపక్షపాతిగా మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి మరోసారి తన నిబద్ధతను చాటుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఉండం గ్రామంలో గంగపుత్ర సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల్లో భాగంగా బుధవారం స్లాబ్ నిర్మాణాన్ని ఆయన సమక్షంలో విజయవంతంగా పూర్తి చేశారు. గత ఎన్నికల ప్రచార సమయంలో గంగపుత్ర సంఘం సభ్యులకు ఇచ్చిన హామీ మేరకు గోక గణేష్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఎస్డీఎఫ్ నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతున్నాయి. స్లాబ్ నిర్మాణం పూర్తవడంతో గ్రామస్తులు, సంఘం నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గోక గణేష్ రెడ్డి మాట్లాడుతూ పదవుల్లో ఉన్నా.. లేకున్నా ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకోవడమే తన లక్ష్యమన్నారు. గంగపుత్రుల చిరకాల స్వప్నమైన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించి పనులను వేగవంతం చేయడం ఆనందంగా ఉందన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు సి.రమేష్ రెడ్డి, వెంకన్న యాదవ్, సర్పంచ్ బోస్ల మహేందర్, ఉప సర్పంచ్ రఫిక్, మాజీ సర్పంచ్ లక్ష్మన్న, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ టి. గంగన్న, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు పొచ్చన్న, కొండ్రు గంగన్న, అశోక్ రెడ్డి, శివయ్య, మహేష్, షారుఖ్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి అభిప్రాయ సేకరణ

- మండల అధ్యక్ష అభ్యర్థి ఎంపిక, గ్రామ కమిటీల ఏర్పాటుపై చర్చ



**రాజముద్ర న్యూస్, సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నూతన తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి ఎంపికతో పాటు గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీల ఏర్పాటుపై మంగళవారం రాత్రి అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతోందన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి నాయకత్వంలో గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీని మరింత విస్తరింపజేస్తామని తెలిపారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని, గ్రామ స్థాయి నుంచి పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసే విధంగా కమిటీలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**రాజముద్ర న్యూస్, తాండూర్:** కొత్తపల్లి రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు తాండూర్ ఎస్సై కె.ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి పోలీస్ స్టేషన్కు చేరుకుని సమాచారం అందించారని, సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా రైల్వే లైన్ పక్కన ఉన్న సిమెంట్ గోడ సమీపంలో వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. అక్కడ రైల్వే ట్రాక్ వద్ద పనిచేస్తున్న కార్మికులను విచారించగా.. మృతుడు మంగళవారం ఉదయం నుంచి రైల్వే ట్రాక్పై అసహజంగా తిరుగుతూ కనిపించినట్లు తెలిపారు. గేట్మెన్కు సమాచారం ఇవ్వడంతో అక్కడి నుంచి వెళ్లి సమీపంలో పనిచేస్తున్న కార్మికుల వద్ద మంచినీళ్లు తాగి తిరిగి వెళ్లాడని చెప్పారు. తర్వాత సమీపంలోని మామిడి తోటకు వెళ్లి తిరిగి వచ్చి పొలం నుంచి రైల్వే ట్రాక్పైకి దూకే సమయంలో అదుపు తప్పి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందినట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారని ఎస్సై తెలిపారు. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేవని చెప్పారు. మృతుడు మొదట గ్రే కలర్ టీ షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని స్థానికులు తెలిపినట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వివరించారు.



ఎవరైనా మృతుడిని గుర్తుపడితే సెల్: 8712656575 కు సమాచారం అందించాలని కోరారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

జిల్లాకలెక్టర్ కుమార్ దీపక్



**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం జైపూర్ మండలం రామారావుపేటలో గల రైస్ మిల్, కోటపల్లి మండలం సర్వాయిపేటలోని గోదాం, వేమనపల్లి మండల కేంద్రంలోని గోదాములను సందర్శించారు. ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తేమ కొలిచే యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు సకాలంలో తరలించాలని ఆదేశించారు. రైస్ మిల్లుల నిర్వాహకులు కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకునేందుకు అవసరమైన హమాలీల సంఖ్యను పెంచుకోవాలని సూచించారు. రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో త్వరగా పూర్తి చేసేలా అధికారులతో సమన్వయం చేసుకుని పనిచేయాలని సూచించారు. లారీ యజమానులు ధాన్యం రవాణాలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, గోదాములకు చేరిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం నిల్వ చేసి తదుపరి ఆదేశాల మేరకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రులకు స్వాగతం పలికిన ఆడే గజేందర్





**రాజముద్ర న్యూస్, బోథ్:** జూన్ 2న తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లను పరిశీలించేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఆసిఫాబాద్ జిల్లాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లా హెలిప్యాడ్ వద్దకు వచ్చిన మంత్రులకు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బోథ్ నియోజకవర్గ ఆడే గజేందర్ ఘన స్వాగతం పలికారు. శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై మంత్రులు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆడే గజేందర్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేసేందుకు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆడే గజేందర్తో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ



**రాజముద్ర న్యూస్, భీంపూర్:** ఉపాధి హామీ కూలీల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు సర్పంచ్ దాసరి రమేష్ అన్నారు. భీంపూర్ మండలం పిప్పల్కోటి గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పథకం పనులను బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో సుమారు 300 మంది కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొంటుండగా, వారి పనితీరు, సౌకర్యాలు, ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం తీవ్ర ఎండల నేపథ్యంలో కూలీలు వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పని ప్రదేశాల్లో కూలీలకు నీడ కల్పించేందుకు ఏర్పాటు చేసిన గ్రీన్ మ్యాట్లను, తాగునీటి సదుపాయాలను తనిఖీ చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు ఆరోగ్య పరిరక్షణపై అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే తెలియజేయాలని సూచించారు. కూలీల ఆరోగ్యం, భద్రతకు గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట్ల శ్రీనివాస్, రెండ్లా భాస్కర్, షేక్ అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య



**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:** రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. బుధవారం జన్నారం మండల కేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాము, మొర్రిగూడలోని రాఘవేంద్ర రైస్ మిల్ గోదాము, చింతగూడలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులతో కలిసి సందర్శించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా అవసరమైన లారీలను వెంటనే సమకూర్చాలని, రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం త్వరితగతిన కొనుగోలు చేసి మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, హమాలీలు, లారీలతో ధాన్యం తరలింపును వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కోల్‌కతా సూపర్ విక్టరీ!

- ముంబై ఇండియన్స్‌పై 4 వికెట్ల తేడాతో ఘన విజయం
- ఈ గెలుపుతో సజీవంగా కోల్ కతా ప్లే ఆఫ్స్ ఆశలు
- పంజాబ్, రాజస్థాన్ జట్ల ఫలితాలపైనే తదుపరి బెర్త్
- పాయింట్ల పట్టికలో 13 పాయింట్లతో ఆరో స్థానానికి చేరిక






**ఐపీఎల్ టోర్నీలో కోల్‌కతా నైట్ రైడర్స్ అదరగొట్టింది. బుధవారం కోల్‌కతా లోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఉత్కంఠ పోరులో ముంబై ఇండియన్స్ పై 4 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఈ విజయంతో కోల్ కతా తన ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంది.**

**కోల్‌కతా :** ఈడెన్ గార్డెన్స్ వేదికగా బుధవారం 2026 మే 20 న జరిగిన మ్యాచ్ లో టాస్ గెలిచిన కోల్ కతా నైట్ రైడర్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ కు దిగిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 147 పరుగులు మాత్రమే చేయగలిగింది. ముంబై బ్యాటర్లలో కార్బిన్ బాష్ 18 బంతుల్లో 32 పరుగులతో అజేయంగా నిలవగా, కెప్టెన్ హార్దిక్ పాండ్యా 27 బంతుల్లో 26 పరుగులు, తిలక్ వర్మ 32 బంతుల్లో 20 పరుగులు చేసి మోస్తరు స్కోరుకు పరిమితమయ్యారు. కోల్ కతా బౌలర్లలో కార్బిన్ బాష్ 3 ఓవర్లలో 30 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. దీపక్ చాహర్ 3 ఓవర్లలో 23 పరుగులిచ్చి ఒక వికెట్, అల్లాహ్ గజన్ఫర్ 4 ఓవర్లలో 25 పరుగులిచ్చి ఒక వికెట్ తీశారు.

### రాణించిన మనీష్ పాండే, పావెల్..

148 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్ కతా నైట్ రైడర్స్ 18.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 148 పరుగులు చేసి ఘన విజయం సొంతం చేసుకుంది. మరో 7 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని సునాయాసంగా చేరుకుంది. బ్యాటర్లలో మనీష్ పాండే 33 బంతుల్లో 45 పరుగులు చేసి జట్టు విజయానికి గట్టి పునాది వేశాడు. అతనికి తోడుగా రోవ్ మన్ పావెల్ 30 బంతుల్లో 40 పరుగులు, అజింక్య రహానే 17 బంతుల్లో 21 పరుగులు చేసి సత్తా చాటారు. ముంబై బౌలర్లలో కామెరూన్ గ్రీన్ 3 ఓవర్లలో 23 పరుగులిచ్చి 2 వికెట్లు, సౌరభ్ దూబే 4 ఓవర్లలో 34 పరుగులిచ్చి 2 వికెట్లు, కార్తీక్ త్యాగి 4 ఓవర్లలో 37 పరుగులిచ్చి 2 వికెట్లు తీశారు.



### ప్లే ఆఫ్స్ ఆశలు సజీవం..

ఈ అద్భుత విజయంతో కోల్ కతా నైట్ రైడర్స్ ప్లే ఆఫ్స్ రేసులో తన ఆశలను సజీవంగా ఉంచుకుంది. పాయింట్ల పట్టికలో 13 మ్యాచ్ లు ఆడిన కోల్ కతా 6 విజయాలతో 13 పాయింట్లు సాధించి ఆరో స్థానానికి చేరుకుంది. అయితే కోల్ కతా ప్లే ఆఫ్స్ కు చేరాలంటే పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లు ఆడే తదుపరి మ్యాచ్ ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాజస్థాన్ 13 మ్యాచ్ లలో 14 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉండగా, పంజాబ్ కింగ్స్ 13 మ్యాచ్ లలో 13 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. ఈ రెండు జట్ల ఫలితాలే కోల్ కతా ప్లే ఆఫ్స్ బెర్త్ ను ప్రభావితం చేయనున్నాయి. మరోవైపు ముంబై ఇండియన్స్ పాయింట్ల పట్టికలో 13 మ్యాచ్ లు ఆడి కేవలం 4 విజయాలు, 9 ఓటములతో 8 పాయింట్లు మాత్రమే సాధించి తొమ్మిదో స్థానానికి పరిమితమైంది.




## ఆసియా క్రీడల బరిలోకి
# మరోసారి జ్యోతి సురేఖ

### మంత్రి లోకేశ్‌ను కలిసిన స్టార్ ఆర్చర్

### రాష్ట్రానికి గర్వకారణమని మంత్రి ప్రశంసలు

**అమరావతి, మే 20 :** అంతర్జాతీయ విలువిద్యలో అద్భుత ప్రతిభ కనబరుస్తున్న ఆంధ్రప్రదేశ్ స్టార్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 2026 ఆసియా క్రీడలకు వరుసగా నాలుగోసారి ఎంపికైన నేపథ్యంలో ఉండవల్లిలోని మంత్రి నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి సురేఖను మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. విలువిద్యలో నిలకడగా రాణిస్తూ రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. రానున్న ఆసియా క్రీడల్లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబర్చి దేశానికి మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించారు. క్రీడాకారిణిగా ఆమెకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని లోకేశ్ భరోసా ఇచ్చారు. క్రీడాకారులకు ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ కూడా పాల్గొన్నారు. జ్యోతి సురేఖ సాధించిన విజయాలను కొనియాడుతూ భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.



## వైభవ్ సంబరాల వెనుక అసలు
# రహస్యం ఇదే..!

**జైపూర్, మే 20:** వైభవ్ సూర్యవంశీ మరోసారి తన విధ్వంసక బ్యాటింగ్‌తో క్రికెట్ అభిమానులను అలరించాడు. రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్న ఈ యువ ఆటగాడు లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన కీలక పోరులో కేవలం 38 బంతుల్లోనే 93 పరుగులు చేసి మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో పది భారీ సిక్సర్లు, ఏడు ఫోర్లు ఉండటం విశేషం. అర్ధ సెంచరీ పూర్తి చేసిన తర్వాత వైభవ్ చేసిన ప్రత్యేక సంబరాలు అందరి దృష్టిని ఆకర్షించాయి. రెండు చేతుల వేళ్లను క్రాస్ చేస్తూ ఇచ్చిన ఫోజ్‌కు ప్రత్యేక అర్థం ఉందా అని అభిమానులు సోషల్ మీడియాలో చర్చించుకున్నారు. మ్యాచ్ అనంతరం మాజీ క్రికెటర్ మురళీ కార్తీక్ ఈ విషయంపై ప్రశ్నించగా వైభవ్ ఆసక్తికర సమాధానం ఇచ్చాడు. తాను చేసే ప్రతి మ్యాచ్‌లో కొత్త తరహా సంబరాలు చేసుకోవడం అలవాటేనని, ఆ ఫోజ్ వెనుక ఎలాంటి ప్రత్యేక సంకేతం లేదని స్పష్టం చేశాడు. గత మ్యాచ్‌లో కూడా భిన్నంగా సంబరాలు చేసుకున్నానని, ప్రతి సారి కొత్తగా ఏదో చేయాలని అనిపిస్తుందని తెలిపాడు. ఇదిలా ఉండగా ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకోవాల్సిన కీలక మ్యాచ్‌లో రాజస్థాన్ జట్టు అద్భుత ప్రదర్శన చేసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. మిచెల్ మార్ష్ 96 పరుగులతో మెరిసగా, జోష్ ఇంగ్లిస్ 60 పరుగులతో ఆకట్టుకున్నాడు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ జట్టు 19.1 ఓవర్లలోనే మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయాన్ని అందుకుంది. వైభవ్ సూర్యవంశీతో పాటు యశస్వి జైస్వాల్ 43 పరుగులు, ధ్రువ్ జురెల్ అజేయ అర్ధ సెంచరీతో జట్టును గెలిపించారు. ఈ విజయంతో రాజస్థాన్ లీగ్ పట్టికలో నాలుగో స్థానానికి చేరుకుంది. చివరి మ్యాచ్‌లో గెలిస్తే ఇతర జట్ల ఫలితాలతో సంబంధం లేకుండా నేరుగా ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించనుంది. వైభవ్ సూర్యవంశీకి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' పురస్కారం దక్కింది.

# కెప్టెన్సీ ఒత్తిడిపై కోహ్లీ భావోద్వేగం

**న్యూఢిల్లీ, మే 20 :** భారత టెస్టు జట్టుకు దాదాపు ఏడేళ్ల పాటు నాయకత్వం వహించిన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, తాను టెస్టు కెప్టెన్సీ ఎందుకు వదులుకోవాల్సి వచ్చిందో తాజాగా వెల్లడించాడు. కెప్టెన్సీ బాధ్యతలు తనపై తీవ్ర మానసిక ఒత్తిడి మోపాయని, ఆ సమయంలో పూర్తిగా అలసిపోయినట్లు తెలిపాడు. టీ20 లీగ్‌ల హవా పెరిగిన సమయంలో కూడా అభిమానులను టెస్టు క్రికెట్ వైపు మళ్లించి, ఆటపై ఆసక్తిని పెంచిన ఆటగాడిగా కోహ్లీ ప్రత్యేక గుర్తింపు పొందాడు. భారత జట్టుకు 68 టెస్టుల్లో నాయకత్వం వహించిన అతడు 40 విజయాలు అందించి అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకడిగా నిలిచాడు. 2022 జనవరిలో అనూహ్యంగా టెస్టు కెప్టెన్సీకి రాజీనామా చేయడం అప్పట్లో సంచలనంగా మారింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన కోహ్లీ, ఆ నిర్ణయం వెనుక ఉన్న కారణాలను వివరించాడు. "భారత జట్టు ఎప్పుడూ అగ్రస్థానంలో ఉండాలనే లక్ష్యంతోనే పని చేశాను. కానీ కెప్టెన్సీ నాపై ఎంతటి మానసిక భారాన్ని మోపిందో అప్పట్లో పూర్తిగా అర్థం కాలేదు. బ్యాటింగ్‌తో పాటు నాయకత్వ బాధ్యతలు కూడా నా వ్యక్తిగత జీవితంపై తీవ్ర ప్రభావం చూపాయి" అని కోహ్లీ చెప్పాడు. ప్రతి మ్యాచ్‌లో తన బ్యాటింగ్‌పై భారీ అంచనాలు ఉండేవని, అదే తనలో తీవ్ర ఒత్తిడికి కారణమైందని తెలిపాడు. "కెప్టెన్సీ వదిలే సమయానికి నేను పూర్తిగా అలసిపోయాను. ఆ బాధ్యతలు నన్ను తీవ్ర ఒత్తిడికి గురి చేశాయి. అందుకే నెమ్మదిగా ఆ బాధ్యతల నుంచి బయటకు రావాలని నిర్ణయించుకున్నాను" అని వివరించాడు. కెప్టెన్సీ నుంచి తప్పుకున్న తర్వాత కూడా తాను క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొన్నట్లు కోహ్లీ



తెలిపాడు. ఆ సమయంలో భారత మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్, బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ తనకు ఎంతో అండగా నిలిచారని గుర్తుచేసుకున్నాడు. "వారిద్దరితో ఎక్కువగా మాట్లాడేవాడిని. నన్ను ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. నేను సాధించిన విజయాలు, రికార్డులను గుర్తు చేస్తూ మళ్లీ నాలో ఉత్సాహాన్ని నింపారు. వారి కోసం ఆడాలనిపించేలా నాలో నమ్మకం పెంచారు" అని కోహ్లీ భావోద్వేగంగా చెప్పాడు.

# పాకిస్థాన్‌పై బంగ్లా చారిత్రక విజయం

**సిల్హెట్, మే 20:** పాకిస్థాన్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో బంగ్లాదేశ్ జట్టు చరిత్ర సృష్టించింది. రెండో టెస్టులో 78 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించిన బంగ్లాదేశ్, రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 2–0తో క్లీన్‌స్వీప్ చేసింది. పాకిస్థాన్‌పై స్వదేశంలో బంగ్లాదేశ్‌కు ఇదే తొలి టెస్టు సిరీస్ విజయం కావడం విశేషం. ఈ విజయంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2027 పాయింట్ల పట్టికలో బంగ్లాదేశ్ ఐదో స్థానానికి ఎగబాకింది. 58.33 శాతం విజయ శాతంతో భారత్‌ను వెనక్కి నెట్టింది. ఇప్పటివరకు తొమ్మిది టెస్టులు ఆడిన భారత జట్టు నాలుగు విజయాలు, నాలుగు ఓటములు, ఒక డ్రాతో 48.15 శాతం పాయింట్లతో ఆరో స్థానానికి పడిపోయింది. మరోవైపు ఈ సిరీస్ పరాజయంతో పాకిస్థాన్ ఎనిమిదో స్థానంలోనే కొనసాగుతోంది. చివరి రోజు 437 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ 316 పరుగులకు ఏడు వికెట్ల నష్టంతో ఆట ప్రారంభించింది. అయితే బంగ్లాదేశ్ బౌలర్లు అద్భుతంగా రాణించి మరో 42 పరుగులకే మిగతా వికెట్లు కూల్చేశారు. దీంతో పాకిస్థాన్ జట్టు 358 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ మహమ్మద్ రిజ్వాన్



ఒంటరి పోరాటం చేశాడు. 94 పరుగులు చేసిన అతడు సెంచరీకి కేవలం ఆరు పరుగుల దూరంలో ఔటయ్యాడు. రిజ్వాన్ ఔటైన వెంటనే పాకిస్థాన్ ఇన్నింగ్స్ పూర్తిగా కుప్పకూలింది. బంగ్లాదేశ్ తరఫున తైజుల్ ఇస్లామ్ అద్భుతంగా బౌలింగ్ చేసి ఆరు వికెట్లు పడగొట్టాడు. చివరి రోజు కీలక వికెట్లు తీసి జట్టు విజయానికి ప్రధాన కారణమయ్యాడు. ప్రమాదకరంగా మారిన రిజ్వాన్‌ను షోరిఫుల్ ఇస్లామ్ ఔట్ చేయడంతో బంగ్లాదేశ్ విజయం ఖాయమైంది. గతంలో 2024లో పాకిస్థాన్ గడ్డపై 2–0తో సిరీస్ గెలిచిన బంగ్లాదేశ్, ఇప్పుడు స్వదేశంలోనూ అదే ఫలితాన్ని పునరావృతం చేసి తమ ఆధిపత్యాన్ని చాటుకుంది.


రాజముద్ర




# ఎన్టీఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ



మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో సందడి నెలకొంది. ఇప్పటికే ఎన్నో రోజుల ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్ పెడుతూ.. ప్రశాంత్‌నీల్ 'డ్రాగన్' గ్లింప్స్‌తో ఫుల్ ట్రీట్ ఇచ్చారు. మరోవైపు ఎన్టీఆర్–త్రివిక్రమ్ కాంబోలో రానున్న 'గాడ్ ఆఫ్ వార్'గా ప్రచారంలో ఉన్న సినిమాకు సంబంధించి నాగవంశీ అప్‌డేట్ ఇచ్చారు. త్వరలోనే షూటింగ్ సెట్‌లో కలుద్దామంటూ ఆయన విషెస్ చెప్పారు. దీంతో ఈ సినిమా చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఇక అభిమానులు, సెలబ్రిటీలు తారక్‌కు శుభాకాంక్షలు చెబుతూ ఫొటోలు పంచుకుంటున్నారు. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్‌కి జన్మదిన శుభాకాంక్షలు. ఒక గొప్ప వారసత్వాన్ని నిలబెట్టుకోవడం అంత సులభం కాదు. కానీ మీరు దానిని ఎంతో గౌరవంతో, వినయంతో, అసాధారణమైన ప్రతిభతో ముందుకు తీసుకెళు తున్నారు. మీ వ్యక్తిత్వం ఎంత గొప్పదో చెప్పడానికి అదే నిదర్శనం. 'డ్రాగన్' గ్లింప్స్ అద్భుతమైన మాస్ విందులా ఉంది. మీరు ఇలాగే కోట్ల మంది హృదయాల్లో ఉంటూ బాక్సాఫీస్‌ను ఒక నిజమైన బాద్‌షాగా ఏలాలని కోరుకుంటున్నాన అంటూ శ్రీను వైట్ల పోస్ట్ చేశారు. హ్యాపీ బర్త్‌డే డియర్ తారక్. హద్దులు దాటి కీర్తిని సొంతం చేసుకున్న ఓ శక్తి ఇప్పుడు మరో గొప్ప ప్రపంచంతో మీ ముందుకు వస్తోంది. డ్రాగన్ గ్లింప్స్ అదిరిపోయింది అంటూ గోపీచంద్ మలినేని శుభాకాంక్షలు తెలిపారు. నాకెంతో ఇష్టమైన వ్యక్తి. నేను అభిమానించే నా హీరో ఎన్టీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. లవ్ యూ కన్నా.. అంటూ నటి ఖుష్బూ విషెష్ చెప్పారు. హ్యాపీ బర్త్‌డే తారక్. నువ్వు ఆనందంగా ఉండాలని ఎన్నో మధురమైన జ్ఞాపకాలను సొంతం చేసుకోవాలని కోరుకుంటున్నా. డ్రాగన్ గ్లింప్స్ అద్భుతంగా ఉంది అంటూ నారా రోహిత్ ఆనందం పంచుకున్నారు. పవర్‌హౌస్, నా రావణ.. తారక్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. మీరు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నాను. 'డ్రాగన్' గ్లింప్స్ చాలా బాగుంది. మీ డ్యాషింగ్ లుక్ నాకు బాగా నచ్చింది. కచ్చితంగా చాలా పెద్ద హిట్ అవుతుందని బాబీ శుభాకాంక్షలు తెలిపారు.



# మోసపోయా!

## అనన్య నాగళ్ల భావోద్వేగం

**హైదరాబాద్, మే 20 :** తెలుగు నటి అనన్య నాగళ్ల తాజాగా తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలు వెల్లడిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన ఆమె సినిమాల్లోకి రాకముందు ప్రముఖ సంస్థ ఇన్ఫోసిస్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశారు. నటనపై ఆసక్తితో షార్ట్ ఫిల్మ్ ద్వారా కెరీర్ ప్రారంభించి, తర్వాత సినీ రంగంలో అడుగుపెట్టారు. మల్లేశం చిత్రంతో వెండితెరకు పరిచయమైన అనన్య నాగళ్ల, తక్కువ కాలంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం వకీల్ సాబ్, మ్యాస్ట్రో, ఊర్వశివో రాక్షసివో, శాకుంతలం, పొట్టేల్ వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనన్య నాగళ్ల తన జీవితంలో ఎదురైన ఓ చేదు అనుభవాన్ని పంచుకున్నారు. "చాలా ఏళ్ల తర్వాత ఒక వ్యక్తి కారణంగా బాగా ఏడ్చాను. దాన్ని లవ్ ఫెయిల్యూర్ అని చెప్పను. కానీ నేను బాగా నమ్మిన వ్యక్తి నన్ను మోసం చేశాడు" అంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. బ్రేకప్ బాధను దాదాపు మూడేళ్ల పాటు అనుభవించినట్లు ఆమె తెలిపారు. "ఉదయం లేవగానే ఆ ఆలోచనలు వెంటాడేవి. ఎంత బిజీగా ఉన్నా అవే గుర్తొచ్చేవి. రాత్రంతా ఏడ్చినా తెల్లవారగానే జిమ్‌కి వెళ్లేదాన్ని. షూటింగ్ సమయంలో కేరవాన్‌లో కూర్చొని ఏడ్చి, తర్వాత కళ్లు తుడుచుకుని కెమెరా ముందుకు వచ్చేదాన్ని" అని అనన్య చెప్పారు. అమ్మాయిల భావోద్వేగాలను సమాజం సరిగా అర్థం చేసుకోవడం లేదని కూడా ఆమె వ్యాఖ్యానించారు. "సోషల్ మీడియాలో అమ్మాయిల గురించి ఎన్నో మీమ్స్ వస్తుంటాయి. ఎక్కువగా అబ్బాయిల దృష్టికోణమే బయటకు వస్తుంది. కానీ అమ్మాయిల మనసులోని బాధ గురించి ఎవరూ మాట్లాడరు" అంటూ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం అనన్య నాగళ్ల చేసిన ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.



# హీరోతో నటించే ఛాన్స్ కోసం..

**ముంబై, మే 20:** తెలుగు సినీ ప్రేక్షకులకు పరిచయమైన నటి హెబ్బా పటేల్ మరోసారి వార్తల్లో నిలిచారు. కన్నడ చిత్రం 'అధ్యక్ష'తో సినీ రంగ ప్రవేశం చేసిన ఆమె, 'అలా ఎలా' సినిమాతో తెలుగు తెరకు పరిచయమయ్యారు. అనంతరం 'కుమారి 21ఎఫ్' చిత్రంతో యువతలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ సినిమా తర్వాత హెబ్బాకు వరుస అవకాశాలు వచ్చాయి. 'ఈడో రకం ఆడో రకం', 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'అంధగాడు', 'మిస్టర్' వంటి చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. గ్లామర్ పాత్రలతో పాటు విభిన్న కథాంశాలున్న సినిమాల్లో కూడా నటిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఓటీటీ వేదికలపైనా అడుగుపెట్టి 'మస్తీస్', 'వ్యవస్థ' వంటి వెబ్ సిరీస్‌లలో కీలక పాత్రలు పోషించారు. ఇటీవల 'ఓదెల రైల్వే స్టేషన్' సినిమాతో మరోసారి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన అభిమాన హీరో గురించి హెబ్బా పటేల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు అత్యంత ఇష్టమైన నటుడు జూనియర్ ఎన్టీఆర్ అని ఆమె తెలిపారు. 'కుమారి 21ఎఫ్' టీజర్ విడుదల కార్యక్రమానికి ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా వచ్చినప్పటి నుంచి ఆయనపై ప్రత్యేక అభిమానం పెరిగిందన్నారు. తారక్ నటన, వ్యక్తిత్వం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. ఎన్టీఆర్ సినిమాలో అవకాశం వస్తే ఎలాంటి పాత్రకైనా సిద్ధమని హెబ్బా వెల్లడించారు. పాత్రకు పెద్ద ప్రాధాన్యత లేకపోయినా, కథలో చిన్న భాగమే అయినా నటించేందుకు సిద్ధమేనన్నారు. కొన్నిసార్లు కెరీర్ కంటే మనసులోని కోరిక నెరవేర్చుకోవడం ముఖ్యమని వ్యాఖ్యానించారు. అలాగే నటుడు సునీల్ చాలా మంచివాడని, ఎంతో కేరింగ్‌గా ఉంటాడని చెప్పారు. నటుడు రాజ్ తరుణ్‌తో కలిసి ఎక్కువ సినిమాలు చేయడం వల్ల మంచి అనుబంధం ఏర్పడిందని తెలిపారు. అయితే వరుసగా కలిసి సినిమాలు చేయడంతో కొంత విరామం అవసరమని సరదాగా వ్యాఖ్యానించారు. తన కెరీర్‌లో 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', '24 కిస్సెస్' చిత్రాల్లో చేసిన పాత్రలు తనకు ఎంతో నచ్చాయని హెబ్బా చెప్పారు. ప్రస్తుతం తాను ఒంటరిగానే ఉన్నానని స్పష్టం చేశారు. ముంబైలో జన్మించిన హెబ్బా పటేల్ సామాజిక మాధ్యమాల్లో కూడా చురుకుగా ఉంటూ అభిమానులతో నిరంతరం మమేకమవుతున్నారు.

# మోడల్‌గా మొదలై..

## మిస్ గ్రాండ్ నుంచి సినీ ప్రపంచం వరకు..!

## పంకూరి గిద్వానికి పెరుగుతున్న గుర్తింపు



భారతీయ నటి, మోడల్ పంకూరి గిద్వాని ప్రస్తుతం సినీ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోకు చెందిన ఆమె 2016లో ఫెమినా మిస్ గ్రాండ్ ఇండియా కిరీటాన్ని అందుకొని జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. 1997 అక్టోబర్ 2న జన్మించిన పంకూరి గిద్వాని, 2019లో విడుదలైన ఉజ్డా చమన్ చిత్రంతో సినీ రంగంలోకి అడుగుపెట్టారు. అనంతరం పలు ప్రాజెక్టుల్లో నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తెలుగు ప్రేక్షకులకు ఆమె లవ్ మౌళి చిత్రంతో పరిచయమయ్యారు. ఇందులో హీరోగా నవదీప్ నటించగా, పంకూరి 'చిత్ర' పాత్రలో విభిన్నమైన నటన కనబరిచి మంచి ప్రశంసలు అందు కున్నారు. ఆలోచనల్లో ప్రత్యేకత కలిగిన యువతిగా ఆమె పోషించిన పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుంది. నటనతో పాటు సామాజిక రంగంలోనూ పంకూరి తన ముద్ర వేస్తున్నారు. 2021లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 'ఖాదీ' ఉత్పత్తుల తొలి బ్రాండ్ అంబాసిడర్‌గా ఆమెను నియమించారు. సంప్రదాయ వస్త్రాల ప్రచారంలో ఆమె కీలక పాత్ర పోషించారు. సినిమాలతో పాటు ఓటీటీ వేదికలలోనూ ఆమె రాణిస్తున్నారు. లీక్డ్! వంటి సిరీస్‌లతో పాటు 'గులాబీ రేవ్డి' వంటి ప్రాజెక్టుల్లో నటిస్తూ విభిన్నమైన పాత్రలను ఎంపిక చేసుకుంటున్నారు. యువ నటిగా పంకూరి గిద్వాని భవిష్యత్తులో మరిన్ని ఆసక్తికరమైన చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సినీ వర్గాలు భావిస్తున్నాయి.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com